# కల్వరి ప్రేమధార

(ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక)




నవంబర్ - డీసెంబర్ 2019
విడి ప్రతి వెల రూ॥20/-

ఎడిటర్:
డా॥ యస్. జయపాల్



# కల్వరి ప్రేమధార పాఠకులకు
## మరియు కల్వరి దర్శనం ప్రేక్షకులకు...

యేసుక్రీస్తు పుట్టుక భూలోకమంతటికి సంతోషమును, సమాధానమును కలుగజేయు రక్షకుని జననమును గుర్తు చేయుచున్నది.

క్రీస్తు తెచ్చిన రెండు సత్యములను మనం గమనించాలి! మొదటిది - ఆయన 'యేసు' అను నామమును ధరించెను. 'యేసు' అనగా 'తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును' అని అర్థము! పాపములను క్షమించే అధికారము యేసు నామములోనే తప్ప మరి దేనికిని, మరెవ్వరికిని లేదు. క్రీస్తు పుట్టుకను జ్ఞాపకము చేసకొంటున్న మనం ఆయన యిచ్చు ఈ పాప క్షమాపణ, పాపము మీద విడుదల సంపాదించుకొన్నామా? అని పరీక్షించుకొనుట చాలా అవసరం!

రెండవది - ఆయన రాజుగా ఈ లోకములోనికి వచ్చెను. ఆయన మన పాపములను క్షమించుట మాత్రమే కాక, ఆయన మన హృదయంలో నివసించి, పరిపాలించాలని వచ్చియున్నాడు. ఆయన రక్షణ రుచి చూచిన మనము మన జీవితముపై సర్వాధికారమును ఆయనకు అప్పజెప్పి, ఆయనను మన హృదయములలో రాజుగా ప్రతిష్ఠించుకోవాలి!

ఆ తరువాత రక్షకుడును, ప్రభువునైన యేసుక్రీస్తును సర్వ లోకమునకు అందించాలి! ఎందుకంటే "ఇదిగో త్వరగా వచ్చుచున్నాను; వాని వాని క్రియ చొప్పన ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది" (ప్రకటన 22:12) అని ప్రభువు చెప్పచున్నాడు.

మీకందరికి.....

**విమోచనార్థమైన క్రిస్మస్ మరియు**
**ఆయన రాకడ కొరకు సిద్ధపరచే**
**నూతన వర్ష శుభాకాంక్షలు!**

లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లగా అవతరించి; సిలువ-మరణ-పునరుత్థానముల ద్వారా వధించబడిన గొఱ్ఱెపిల్లగా శక్తియు, ఐశ్వర్యమును, జ్ఞానమును, బలమును, ఘనతయు, మహిమయు, స్తోత్రమును పొందనర్హుడగు మన ప్రభువు తన సకల ఆశీర్వాదములను ఈ నూతన వర్షములో మనకనుగ్రహించి, దీవించును గాక!

**- కల్వరి కుటుంబము**

# కల్వరి ప్రేమధార

ఎడిటర్: యన్. జయపాల్ నవంబరు-డిశంబరు 2019

కల్వరి 35 {ఈ పత్రిక ఉచితం కాదు, కనీస వార్షిక విరాళము రూ.120/-; ప్యాకింగ్ & పోస్టేజి రూ.30/- అదనం!} ధార 6

Vol-XXII ISS-VI

Nov-Dec 2019 R.N.I. No.69868/98


## ముఖాముఖి

ప్రభువునందు ప్రియులైన 'కల్వరి ప్రేమధార' పాఠకులకు, శ్రేయోభిలాషులకు క్రీస్తు నామమున శుభమని చెప్పి వ్రాయుట!

దేవుని కృపలో సజీవులుగా సంవత్సరాంతము లోనికి చేరిన మనం ప్రభువును స్తుతిస్తూ, ఆయన ప్రేమను తలస్తూ, ఆయన సాక్షులుగా బ్రతకాలి! యేసు ప్రభువు జననం గురించి ఎన్నోసార్లు విని, ఆయన సిలువ-మరణ-పునరుత్థానాల యందు విశ్వసించి, రక్షించబడిన మనకు ఇప్పుడు క్రీస్తు జననం పెద్ద విషయం కాదు!

అయితే ఇంకా క్రీస్తును ఎరుగనివారు ఎందరో ఉన్నారని, ఆయన జననములోని ప్రత్యేకతను గుర్తించలేనివారిగా ఉన్నారని మనము ఎరిగి, మరోసారి ఆయన జననాన్ని జ్ఞాపకం చేసుకొంటూ, "నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు" అనే సువార్తను ప్రకటించుటలో తప్పేమీ లేదు.

క్రిస్మస్ అంటే అనవసరమైన ఆచారాలకు, ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వటం తప్పే! యేసుక్రీస్తు జన్మించింది డిశంబరు 25 కాదు, అది ఒక పేరు మోసిన అన్య (గ్రీకు) పండుగ రోజు అనునది వాస్తవమే! అయితే ఆయన జననమును గుర్తు చేసుకొన నవసరం లేదని అనటం ఎంతవరకు సమంజసం!

కాని, క్రిస్మస్ అనే మాటకు Christ-mass (క్రీస్తు ఆరాధన) అన్నది గుర్తించి క్రీస్తును ఆరాధించుటకు, ఒక బాలుడిగా లోకములో జన్మించిన క్రీస్తును మన పిల్లలకు పరిచయం చేయడం, వారి చిన్ని హృదయా లను ఆనందపరచటం, ఆనాటి గొల్లల వలె మనం సంతోషించడం, జ్ఞానులవలె ఆరాధించటం మంచిదేగా!

గనుక అల్లరి చిల్లరిగా కాక, ఆత్మతో సత్యముతో ప్రభువును ఘనపరుస్తూ, మరో నూతన సంవత్సరము లోనికి ప్రవేశిద్దాం!

\- ఎడిటర్

## ఈ సంచికలో....


★ రక్షణ పొందకయే యున్నారా?
★ రూతు గ్రంథము
★ నేను నేనే - ఉన్నవాడను అనువాడను
★ ఏడవ బూర
★ ఒక్కో సువార్తలో మాత్రమే గల అంశాలు
★ యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ?
★ సమీప బంధువు బోయజు
★ కంప్యూటర్లో కంప్యూటర్లు
★ సేవకులకు పది ఆజ్ఞలు
★ మీరు శ్రేష్ఠులు కారా?
★ బైబిలంతటిలో మన యేసయ్య
★ నీకిచ్చిన పిల్లల కొరకు
★ ఛార్లెస్ టి. స్టడ్
★ క్రైస్తవులుగా చలామణి అవుతున్నవారు
★ ప్రేమలో స్వార్థం లేదు
★ ప్రభువా! నూతన కార్యము చేయుము
★ అర్థాలు తెలుసుకొందాం!
ఇంకా...ఇంకా...ఎన్నెన్నో....



*Our Only Address:*

**JAYAPAUL FOUNDATIONS**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY,**
**CHENNAI-600 042.**

**Phone : 044-2243 4787**
**Cell : (0) 98847 07779,**
**(0) 89 39 39 39 39**
**E-mail : Enquiry@jayapaul.com**
**Website : www.jayapaul.org**

# రక్షణ పొందకయే యున్నారా?

**"కోతకాలము గతించియున్నది, గ్రీష్మకాలము జరిగిపోయెను, మనము రక్షణ నొందకయే యున్నాము".** (యిర్మీయా 8:20)

దేవుడు మానవుని రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లు చేసి ముగించెను. మానవుడు తన స్వశక్తి ద్వారా తన్ను రక్షించుకోలేడని; మానవుని ధర్మకార్యాలు, పుణ్యకార్యాలు దేవుని నీతిని సంతుష్టిపరచలేవని ఎరిగిన దేవుడు మానవుని పాప విమోచన కొరకు తన కుమారుని ఈ లోకములోనికి పంపించి, సిలువలో చిందించిన ప్రశస్త రక్తము ద్వారా మానవునికి పాప క్షమాపణ, రక్షణ భాగ్యము కలిగించెను.

అయితే రక్షణ కార్యము సిలువలో సంపూర్ణమైనదని సంతోషిస్తే ప్రయోజనం లేదు గాని, ఆ రక్షణను ఒక్కొక్కరు వ్యక్తిగతంగా అంగీకరించవలసి యున్నది. ఎవరైతే తన పాపముల కొరకు పశ్చాత్తాపపడి, ఒప్పుకొని యేసుని అంగీకరించెదరో వారు రక్షించబడెదరు. యేసుప్రభువు రక్షణ కార్యము సమాప్తమైనదని చెప్పి ఇంచుమించు రెండు వేల సంవత్సరములు అయినప్పటికినీ, ఇంకనూ రక్షణ పొందనివారు అనేకులు ఉన్నారు. 'యేసుక్రీస్తు రక్షించును' అను సత్యమును తెలియనివారు అనేకులుండగా, క్రీస్తు సువార్తను విని కూడా నిర్లక్ష్యము వలన రక్షణ పొందనివారు మరనేకులున్నారు.

'నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను జ్ఞాపకము చేసికొనుము' అని దేవుడు సెలవిస్తుండగా (ప్రసంగి 12:1,2); ఆటపాటలతో బాల్యమును గడిపివేసి, యౌవనములో ప్రవేశించినవారు అనేకులున్నారు. యౌవన కాలమున కాడిని మోయుట నరునికి మేలు (విలాపవాక్యములు 3:27) అని బైబిలు చెప్పుచుండగా; యౌవన కాలపు ఇచ్ఛలకు లోనై, తమ శరీరాన్ని విచ్చలవిడిగా వాడుతూ; తమ ఇష్టానుసారంగా జీవిస్తూ, దేవుని మరచినవారు అనేకులున్నారు. దేవాలయముగా ఉండవలసిన శరీరాన్ని పాపపు నిలయాలుగా మార్చుకొని, సమాధానము లేక కుటుంబ జీవితాల్లో ప్రవేశిస్తున్నారు. అన్యోన్యంగా జీవించవలసిన భార్యాభర్తలు అనుమానాలతో, పోట్లాటలతో ఉండి పరలోకము వలె ఉండవలసిన కుటుంబాలను నరకాలుగా మార్చుకొంటున్నారు.

'ఈ గృహాధిపతి క్రీస్తు' అనే వచనాన్ని గోడపై పెట్టుకొన్నప్పటికీ, ఆ భార్యాభర్తలు రక్షించబడనందున ఆ గృహములో దేవుని సన్నిధి లేకపోవుట, సాతాను కార్యాలు నెరవేరుట చూచుచున్నాము! అటువంటి క్రీస్తు లేని కుటుంబములో జన్మించిన బిడ్డలు బలహీనులుగాను, వ్యాధిగ్రస్థులుగాను ఉండుటయే గాక చిన్న వయస్సు నుండే మూర్ఖులుగాను, దేవుని ఎరుగనివారుగాను పెరుగుచున్నారు.

ఈ వర్తమానాన్ని చదువుచున్న ప్రియ పాఠకా! నీవు రక్షించబడినావా? నీ బాల్య దినములు, యౌవన దినములు గడిచిపోయి కుటుంబ జీవితములో ఉన్నావేమో! ఇప్పుడైనా క్రీస్తు యిచ్చు రక్షణ సంపాదించుకొన్నావా? ఇంకా నీ జీవితమును నిర్లక్ష్యము చేస్తే మరింత సంకటము, బాధ నీకు కలుగును. అప్పుడు నీవు "తుదకు నీ మాంసమును నీ శరీరమును క్షీణించినప్పుడు అయ్యో, ఉపదేశము నేనెట్లు త్రోసివేసితిని? నా హృదయము గద్దింపు నెట్లు తృణీకరించెను? నా బోధకుల మాట నేను వినకపోతిని. నా ఉపదేశకులకు నేను చెవియొగ్గలేదు. నేను సమాజ సంఘముల మధ్య నుండినను ప్రతి విధమైన దౌష్ట్యమునకు లోబడుటకు కొంచెమే యెడమాయెను అని నీవు చెప్పుకొనుచు మూలుగుచు నుందువు" (సామెతలు 5:11-14).

అనేకుల జీవితాల్లో కోతకాలము, గ్రీష్మకాలము గతించిపోయినవి. నీ క్షేమ కాలములో దేవుడు నీతో మాట్లాడినా నీవు నిర్లక్ష్యపెట్టావు. నీకు సమృద్ధి నిచ్చి దీవించిన సమయములో దేవుని మరిచావు. నీ జీవితం పచ్చగా కళకళలాడుతూ దేవుని ఆశీర్వాదాలతో నిండి ఉన్నప్పుడు ఆయన స్వరాన్ని నీవు పెడచెవిని పెట్టావు. నీ జీవితంలో దేవుడు నీకు ఎన్నో తరుణాలు యిచ్చినప్పటికీ నీవు నిర్లక్ష్యపెట్టావు. అనేక సంవత్సరాల ఆయుష్షను ప్రభువు నీకిచ్చినప్పటికీ, నీ వృద్ధాప్యములో కూడా నీవింకనూ క్రీస్తును అంగీకరించని వ్యక్తిగా ఉన్నావా? ప్రేమ, దయ కలిగిన దేవుడు ఏ ఒక్కరు నశింపబడుటకు ఇష్టము లేక అంతట అందరు మారుమనస్సు పొందాలని ఆశిస్తున్నాడు (II పేతురు 3:9; అపొ. కార్య. 17:30). లోబడనొల్లని ప్రజల వైపు దినమంతయు చేతులు చాచి బ్రతిమలాడుచున్నాడు (యెషయా 65:2). "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలగుటకు నియమింపలేదు" (I థెస్స 5:9).

అనేక అవకాశాలను, అనేక తరుణాలను పొందినను రక్షించబడని వ్యక్తిగా నీవున్నావేమో! ఇదిగో మరొక సంవత్సరాన్ని దేవుడు నీకు ఈవిగా యిచ్చియున్నాడు. "దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరించుదువా? నీ కాఠిన్యమును, మార్పు పొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు" (రోమా 2:4,5). ఇదిగో దేవుడు కృపాకాలంగా ఈ సమయాన్ని నీకిచ్చియున్నాడు. ఆయన కృపను నిర్లక్ష్య పెట్టక నేడే నీ పాపములను ఒప్పుకొని, మారుమనస్సు పొందుము! **- యన్. జయపాల్**

బైబిలు పఠనం :

# రూతు

| | | | |
|---|---|---|---|
| *గ్రంథకర్త* | *: సమూయేలు కావచ్చు!* | *అధ్యాయములు* | *: 4* |
| *కాలము* | *: క్రీపూ. 11వ శతాబ్దము* | *వచనములు* | *: 84* |
| *ముఖ్యాంశము* | *: విమోచన* | *ముఖ్య వచనములు* | *: 1:16; 3:11* |

**గ్రంథ విభజన**

| | | | |
|---|---|---|---|
| *1వ అధ్యాయము* | *: రూతు తీర్మానము* | *3వ అధ్యాయము* | *: రూతు విశ్రాంతి* |
| *2వ అధ్యాయము* | *: రూతు పరిచర్య* | *4వ అధ్యాయము* | *: రూతు ప్రతిఫలం* |

రూతు అనగా 'సంతృప్తి' లేక 'సౌందర్యము' అని అర్థము! ఈమె మోయాబీయురాలు! అయితే దేవుని కృప వలన దేవుని బిడ్డలతో చేర్చబడెను. రూతు – అన్యులలో నుండి ప్రభువు కొరకు ఏర్పరచబడిన సంఘమునకు ముంగుర్తు! నయోమి – దేవునిని విడిచి, చెదరిపోయిన ఇశ్రాయేలీయులకు గుర్తు! బోయజు – విడుదలకు, విమోచనకు ముఖ్యముగా క్రీస్తుకు సాదృశ్యమై యున్నాడు.

ఈ గ్రంథములో క్రీస్తు ప్రభువు విమోచకుడుగా చూపించబడ్డాడు. బోయజు రూతును విడిపించినట్లు; క్రీస్తు పాపిని విడిపించి ఆదరిస్తున్నాడు. విమోచించబడిన రూత బోయజుతో చేర్చబడి, శాంతి పొందినట్లే; సంఘము కూడా పరమ బోయజు అయిన క్రీస్తుతో చేర్చబడిన తరువాతనే విశ్రాంతి పొందును.

బోయజు అనగా 'అతనియందు బలము కలదు' అని అర్థము! అలాగే మన ప్రభువు ధనవంతుడు కాబట్టి అన్యులము, పాపులము, నరక పాత్రులమైన మనలను యేసుక్రీస్తు విడిపించి, పోషించి, ప్రేమించి పరలోక రాజ్య వారసులుగా చేయ సమర్థుడు!

వెలివేయబడిన రూతు విశ్వాసము ద్వారా యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడినది. "నీవు వెళ్లు చోటికే నేను వచ్చెదను, నీవు నివసించు చోటనే నేను నివసించెదను, నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు; నీవు మృతిబొందు చోటను నేను మృతి బొందెదను" (1:16,17) అని రూతు తన అత్తతో చెప్పిన మాటల వంటి మాటలు మానవ సాహిత్యములోనే మరెక్కడా కనబడవు. రూతు యొక్క దృఢ నిశ్చయము, విశ్వాసము ఎండిన ఆమె జీవితము చిగిరించి, ఫలించునట్లు చేసెను. అలాగే నరక పాత్రులమైన మనం విశ్వాసముతో క్రీస్తును వెంబడించుచు, యజమానిగా ఆయనను అంగీకరించటం ద్వారా పరమపురి చేరగలము!

న్యాయాధిపతుల గ్రంథము చదువుచుండగా, ఎడారిలో పయనించినట్లుండును. కాని రూతు గ్రంథము నీటిబుగ్గ వలె ఆహ్లాదకరముగా నున్నది. –యన్. జయపాల్

# నేను నేనే - ఉన్నవాడను అనువాడను

★ నేను ఉన్నవాడను అనువాడను (నిర్గమ 3:14)
★ నేను నేనే దేవుడను (ద్వితీయో 32:39)
★ నేను తప్ప వేరొక దేవుడు లేడు (ద్వితీయో 32:39)
★ నేనే మృతినొందించువాడను, బ్రదికించువాడను (ద్వితీయో 32:39)
★ నేనే గాయపరచువాడను, స్వస్థపరచువాడను (ద్వితీయో 32:39)
★ నేనే జ్ఞానమునకు ఆధారము (సామెతలు 8:14)
★ నేను మొదటివాడను కడవరివారితోను ఉండువాడను (యెషయా 41:4)
★ యెహోవాను నేనే; ఇదే నా నామము (యెషయా 42:8)
★ నేను నిన్ను విమోచించియున్నాను (యెషయా 43:1)
★ నేను నీకు తోడైయున్నాను (యెషయా 43:5)
★ నేను తప్ప వేరొక రక్షకుడు లేడు (యెషయా 43:11)
★ నేనే మీకు పరిశుద్ధ దేవుడను (యెషయా 43:15)
★ నేనే మీకు రాజును (యెషయా 43:15)
★ నేనే నీ అతిక్రమములను తుడిచివేయువాడను (యెషయా 43:25)
★ నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను (యెషయా 43:25)
★ నేను నిన్ను సృష్టించి, గర్భములో నిన్ను నిర్మించితిని (యెషయా 44:2)
★ నేనే సమస్తమును జరిగించువాడను (యెషయా 44:24)
★ నేనే ఆకాశమును విశాలపరచినవాడను (యెషయా 44:24)
★ నేను యెహోవాను మరి ఏ దేవుడును లేడు (యెషయా 45:5)
★ నేను తప్ప ఏ దేవుడును లేడు (యెషయా 45:5)
★ నేను వెలుగును సృజించినవాడను (యెషయా 45:7)
★ నేనే భూమిని కలుగజేసినవాడను (యెషయా 45:12)
★ నేనే భూమి మీద నరులను సృజించినవాడను (యెషయా 45:12)
★ నేను నీతిపరుడనగు దేవుడను (యెషయా 45:21)
★ నేనే నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను (యెషయా 46:4)
★ నేనే ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను (యెషయా 46:4)
★ నేనే నీ తలవెండ్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను (యెషయా 46:4)
★ నేను దేవుడను నన్ను పోలినవాడెవడును లేడు (యెషయా 46:9)
★ నేనే దేవుడను – మరి ఏ దేవుడును లేడు (యెషయా 46:9)
★ నేనే ఉన్నాను నేను తప్ప మరి ఎవరును లేరు (యెషయా 47:8)
★ నేనే ఆయనను నేను మొదటివాడను, కడపటివాడను (యెషయా 48:12)
★ నేనే నీ పిల్లలను రక్షించెదను (యెషయా 49:25)

★ నేనే నా గొఱ్ఱెలను మేపి పరుండబెట్టుదును (యెహెజ్కేలు 34:15)
★ నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును (యోవేలు 2:28)
★ నేనే జీవాహారమును (యోహాను 6:35)
★ నేను లోకమునకు వెలుగును (యోహాను 8:12)
★ నేను ఈ లోక సంబంధుడను కాను (యోహాను 8:23)
★ నేను పైనుండి వచ్చినవాడను (యోహాను 8:23)
★ నేను దేవుని యొద్ద నుండి బయలుదేరి వచ్చియున్నాను (యోహాను 8:42)
★ నేనే గొఱ్ఱెలు పోవు ద్వారమును (యోహాను 10:8)
★ నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని (యోహాను 10:11)
★ నేను నా గొఱ్ఱెలను ఎరుగుదును (యోహాను 10:15)
★ నేనే పునరుత్థానమును జీవమును (యోహాను 11:25)
★ నేను బోధకుడను ప్రభువును (యోహాను 13:13)
★ నేనే మార్గమును సత్యమును జీవమును (యోహాను 14:6)
★ నేను నిజమైన ద్రాక్షావల్లిని (యోహాను 15:1)
★ నేను లోకమును జయించియున్నాను (యోహాను 16:33)
★ నేను సత్యమునకు సాక్షిగా వచ్చితిని (యోహాను 18:37-38)
★ నేను పరిశుద్ధుడను (I పేతురు 1:14)
★ నేను వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉండువాడను (ప్రకటన 1:8)
★ నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను (ప్రకటన 1:18)
★ నేను నీ క్రియలను నీ కష్టమును ఎరుగుదును (ప్రకటన 2:2)
★ నేను నీకు జీవకిరీటము ఇచ్చెదను (ప్రకటన 2:10)
★ నేను త్వరగా వచ్చుచున్నాను (ప్రకటన 3:11)
★ నేను తలుపునొద్ద నుండి తట్టుచున్నాను (ప్రకటన 3:20)
★ నేనే ఆదియు అంతమును (ప్రకటన 22:13)
★ నేనే అల్ఫాయు ఓమెగయును (ప్రకటన 22:13)

– ఎడిటర్

## కల్వరి ప్రేమధార పాఠకులకు విజ్ఞప్తి!

ఈ పత్రిక పరిచర్య భారభరితమైనది! మీ వార్షిక విరాళము చెల్లించి సహకరించండి! ఈ పత్రిక మీకు అవసరం లేకపోతే ఒక పోస్ట్ కార్డ్‌పై మీ పేరు, చిరునామాతో సహా వ్రాసి తెలియజేయండి! లేక ఈ నంబర్‌కు SMS చేయండి! (0) 89 39 39 39 39. మీ వార్షిక విరాళము Paytm ద్వారా లేక Google Pay ద్వారా కూడా పంపించవచ్చు! మీరు రుసుము పంపిన తరువాత మీ పేరు, చిరునామా, వివరములు తప్పక మాకు తెలియజేయండి!

మా చిరునామా : కల్వరి, **29**, న్యూ కాలనీ రోడ్, వేలచ్చేరి, చెన్నై-**600 042.**

ప్రకటన సందేశం :

# ఏడవ బూర

(గత సంచిక తరువాయి....)

**"రెండవ శ్రమ గతించెను; ఇదిగో మూడవ శ్రమ త్వరగా వచ్చుచున్నది. ఏడవ దూత బూర ఊదినప్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఆ శబ్దములు - ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను; ఆయన యుగయుగముల వరకు ఏలుననెను".** (ప్రకటన 11:14,15)

"మరియు నేను చూడగా ఆకాశ మధ్యమున ఒక పక్షిరాజు ఎగురుచు - బూరలు ఊదబోవుచున్న ముగ్గురు దూతల బూరల శబ్దములను బట్టి భూనివాసులకు అయ్యో, అయ్యో, అయ్యో, అని గొప్ప స్వరముతో చెప్పుట వింటిని" (ప్రకటన 8:13). అయ్యో, అయ్యో, అయ్యో అని గొప్ప స్వరముతో అంగలార్చిన పక్షి (రాజు) రాబోయే భయంకరమైన శ్రమలను గురించి తెలియజేయుచున్నది. ఆ మూడు కేకలు బహు భయంకరమైన అపాయములను సూచించుచున్నవి.

యేసుప్రభువు భూలోకములో ఉన్నప్పుడు - 'అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా; అయ్యో, కొరాజీనా అయ్యో, బేత్సయిదా' అని వాటి భయంకరమైన స్థితిని గురించి, హృదయ కాఠిన్యాన్ని గురించి, వేషధారణను గురించి హెచ్చరించెను. 'అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను' అని యెషయా; 'అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను' అని పౌలు; 'అయ్యో, ప్రభువా, మమ్మును విడనాడితివా' అని యెహోషువ పశ్చాత్తాపపడినట్లు నేడు మనం పశ్చాత్తాపపడితే ఎంతో మేలు! లేనియెడల ఆనాడు అయ్యో, ఆయ్యో అని అంగలార్చినను మరి రక్షణ పొంద నవకాశము ఉండదు. "అయ్యో, ఉపదేశము నేనెట్లు త్రోసివేసితిని? నా హృదయము గద్దింపునెట్లు తృణీకరించెను? నా బోధకుల మాట నేను వినక పోతిని" (సామెతలు 5:12,13) అని అంగలార్చినను ప్రయోజనము ఉండదు.

'అయ్యో' అనే పదము బహు దుఃఖకరమైనది, ఘోరమైనది. ఈ ముమ్మారు అయ్యో, అయ్యో, అయ్యో అన్నది రాబోయే మూడు శ్రమలను గురించి తెలియజేయ బడినది. అగాధములో నుండి బయలువెళ్ళిన గుఱ్ఱములను పోలిన రూపములు కలిగి; తేళ్ళకున్నటువంటి బలమును, సింహములకున్నటువంటి కోరలును కలిగి మనుష్యులను అయిదు నెలల వరకు బాధించుటకు అధికారమియ్యబడగా; మనుష్యులు బహు శ్రమల పాలై చావవలెనని కోరినను, చావు రానందున బహు శ్రమ పడినది - మొదటి శ్రమ మరియు మొదటి అయ్యో!

ఆ తరువాత ఆరవ దూత బూర ఊదినప్పుడు ఇరువది కోట్లకు మించిన గుఱ్ఱపు రౌతుల సైన్యము బయలువెడలి అగ్ని ధూమ గంధకములను కురిపిస్తూ; నోళ్లయందును, తోకల యందును ఉన్న బలము చేత మనుష్యులను శ్రమపెట్టి, దెబ్బలు కొట్టగా మనుష్యులలో మూడవ భాగము చంపబడిరి. ఇది రెండవ శ్రమ మరియు రెండవ అయ్యో!

ఇప్పుడు ఏడవ దూత బూర ఊదినప్పుడు రక్షణను తృణీకరించి, మారుమనస్సు నొందని ప్రజలు దేవుని ఉగ్రతకు గురై, తప్పక అప్పగించబడిరి. అంతేగాక, ఏడవ దూత బూర ఊదినప్పుడు "ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను" (ప్రకటన 11:15). అంతవరకు సాతాను పెత్తనం చేసిన ఈ లోక రాజ్యములు క్రీస్తువాయెను. ప్రభువు తన పరిచర్య ప్రారంభంలో నలభై దినములు ఉపవాసముండి ప్రార్థించినప్పుడు శోధకుడైన సాతాను ఎత్తైన కొండ మీదికి ఆయనను తీసికొనిపోయి; ఈ లోక రాజ్యములన్నిటిని, వాటి మహిమను చూపి – నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటినన్నిటిని నీకిచ్చెదనని ఆయనతో చెప్పగా; యేసు వానితో – సాతానా, పొమ్ము! అని చెప్పి, తండ్రి చిత్తమును నెరవేర్చుటకే నేను వచ్చితినని, సిలువలో బలియాగము చేయుట ద్వారా తన రక్తమిచ్చి మనలను కొని, మనకు విమోచన సిద్ధపరచెను.

ఇప్పుడు సర్వాధికారము ఇయ్యబడినవాడుగా ఈ లోక రాజ్యము ప్రభువు దాయెను. ఇక పాపము లేని రాజ్యాన్ని ఆయన స్థాపించి; సమాధాన, సంతోషాలతో మనం వర్ధిల్లునట్లు మనలను పరిశుద్ధ జనముగా చేసి పరిపాలించును. ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను; ఆయన యుగయుగములు ఏలునని బైబిలు చెప్పుచున్నది (ప్రకటన 11:15).

"అంతట దేవుని యెదుట సింహాసనాసీనులగు ఆ యిరువది నలుగురు పెద్దలు సాష్టాంగపడి దేవునికి నమస్కారము చేసి – వర్తమాన భూత కాలములలో ఉండు దేవుడవైన ప్రభువా, సర్వాధికారీ, నీవు నీ మహా బలమును స్వీకరించి యేలుచున్నావు గనుక మేము నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము" (ప్రకటన 11:16,17) అనిరి. ఏడవ దూత బూర ఊదినప్పుడు "మృతులు తీర్పు పొందుటకును, నీ దాసులగు ప్రవక్తలకును, పరిశుద్ధులకును, నీ నామమునకు భయపడు వారికిని తగిన ఫలము నిచ్చుటకును, గొప్పవారేమి, కొద్దివారేమి భూమిని నశింపజేయువారిని నశింపజేయుటకును సమయము వచ్చియున్నదని చెప్పిరి" (ప్రకటన 11:18).

**(సశేషం)**

– యస్. జయపాల్

## మత్తయి సువార్తలో మాత్రమే గల ఈ సంఘటనలు

1. యోసేపు కల (మత్తయి 1:20-24)
2. తూర్పు దేశపు జ్ఞానుల రాక (మత్తయి 2:1-12)
3. ఐగుప్తుకు బాలయేసు కొనిపోబడుట (మత్తయి 2:13-15)
4. పసిపిల్లల వధ (మత్తయి 2:16-18)
5. ఇస్కరియోతు యూదా మరణము (మత్తయి 27:3-10)
6. పిలాతు భార్యకు వచ్చిన కల (మత్తయి 27:19)
7. ఇతర పునరుత్థానములు (మత్తయి 27:52)
8. కావలివారికి లంచమిచ్చిన విషయము (మత్తయి 28:11-15)
9. మహా ఆజ్ఞలోని బాప్తిస్మము (మత్తయి 28:19-20)

## మార్కు సువార్తలో మాత్రమే గల ఈ సంఘటనలు

1. విత్తనము మొలకెత్తుటను గూర్చిన ఉపమానము (మార్కు 4:26-29)
2. చెవిటివానిని స్వస్థపరచుట (మార్కు 7:31-37)
3. బేత్సయిదా వద్ద గ్రుడ్డివానిని స్వస్థపరచుట (మార్కు 8:22-26)

## లూకా సువార్తలో మాత్రమే గల ఈ సంఘటనలు

1. బాప్తిస్మమిచ్చు యోహాను, క్రీస్తు పుట్టుకలను గూర్చిన వృత్తాంతము (లూకా 1:5-80)
2. యేసు చిన్నతనమును గూర్చి (లూకా 2:1-52)
3. హేరోదు బాప్తిస్మమిచ్చు యోహానును చెరసాలలో బంధించుట (లూకా 3:19,20)
4. నజరేతు నందు యేసు తిరస్కరించబడుట (లూకా 4:16-30)
5. అద్భుతమైన రీతిలో చేపలు వలలో పడుట (లూకా 5:1-11)
6. ఒక విధవరాలి కుమారుని మృతులలో నుండి లేపుట (లూకా 7:11-17)
7. పాపపు స్త్రీ యేసు పాదాలను అభిషేకించుట (లూకా 7:36-50)
8. స్త్రీలు యేసుతో ప్రయాణించుట (లూకా 8:1-3)
9. క్రీస్తు మరణమునకు ముందు అద్భుతములు, బోధలు (లూకా 10:1-18:14)
10. యేసు జక్కయ్యను సంధించుట (లూకా 19:1-10)
11. రాజు, అతని పదిమంది సేవకులను గూర్చిన ఉపమానము (లూకా 19:11-27)
12. హేరోదు ముందు యేసు తీర్పునకై నిలువబడుట (లూకా 23:6-12)
13. ఆరోహణమునకు ముందు పలికిన చివరి మాటలు (లూకా 24:44-49)

## యోహాను సువార్తలో మాత్రమే గల ఈ సంఘటనలు

1. యేసు నీళ్ళను ద్రాక్షారసముగా మార్చుట (యోహాను 2:1-11)
2. యేసు దేవాలయమును శుద్ధిచేయుట (యోహాను 2:12-25)
3. నీకొదేము యేసును రాత్రివేళ కలియుట (యోహాను 3:1-21)
4. యేసు బావియొద్ద సమరయ స్త్రీతో మాట్లాడుట (యోహాను 4:27-38)
5. కనానులో అధికారి కుమారుని స్వస్థపరచుట (యోహాను 4:46-54)
6. అవిటివానిని స్వస్థపరచుట (యోహాను 5:1-16)
7. పాపములో పట్టబడిన స్త్రీని యేసు క్షమించుట (యోహాను 8:1-11)
8. పుట్టు గ్రుడ్డివానిని యేసు స్వస్థపరచుట (యోహాను 9:1-7)
9. యూదులు యేసును ప్రశ్నించి, రాళ్ళతో కొట్టబోవుట (యోహాను 10:22-42)
10. లాజరు సమాధిలో నుండి లేపబడుట (యోహాను 11:1-45)
11. యేసు తన గురించి ప్రార్థించుట (యోహాను 17:1-5)
12. మరొకసారి చేపలు అద్భుతముగా వలలో పడుట (యోహాను 21:1-14)
13. యేసు చేపలు పట్టుచున్న శిష్యులకు కనిపించుట (యోహాను 21:1-14)
14. యేసు పేతురుతో మాట్లాడుట (యోహాను 21:15-25)

## పట్టుదలతో కూడిన ప్రార్థన

ఒకరోజు జార్జిముల్లర్ తన అయిదుగురు మిత్రుల కొరకు ప్రార్థింప నారంభించాడు. అనేక నెలల అనంతరం వారిలో ఒకరు ప్రభువును అంగీకరించారు. పదేండ్ల తరువాత ఇద్దరు మారుమనస్సు పొందారు. నాలుగవ వ్యక్తి మారడానికి 25 సంవత్సరములు పట్టినది.

అయితే అయిదవ వ్యక్తి కొరకు ముల్లర్ తన మరణ పర్యంతము అనగా 52 ఏండ్లు ప్రార్థించెను. అతడు తప్పక క్రీస్తును అంగీకరిస్తాడన్న నిరీక్షణను ముల్లర్ విడువలేదు. అతడు మరణించిన రోజు, అంతిమ క్రియలు జరుగు సమయానికి ఆ ఆఖరి మిత్రుడు కూడా రక్షింపబడెను.

అతడు మారుమనస్సు పొంది, తన రక్షణ సంగతి ముల్లర్‌కు తెలియజేయ వలెనని వచ్చెను గాని, అప్పటికే ముల్లర్ భౌతిక శరీరమును సమాధుల దొడ్డిలోనికి తీసుకొని పోయిరి. ఆ స్నేహితుడు అచ్చట నిలువబడి, 'నా మిత్రుడైన ముల్లర్ నా కొరకు గత 52 సంవత్సరములు ప్రార్థించెను. ఇదిగో ఇప్పుడు నేను మారియున్నాను. ముల్లర్ మరణించెను కాని, ఆయన ప్రార్థన ఫలితముగా నేను విశ్వాసినైతిని' అని చెప్పెను (యాకోబు 5:16).

# యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ?

**"యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ ఉన్నాడు? తూర్పు దిక్కున మేమాయన నక్షత్రమును చూచి ఆయనను పూజింప వచ్చితిమని చెప్పిరి".** (మత్తయి 2:2)

క్రీస్తు ప్రభువు పుట్టినప్పుడు కనబడిన ఆ నక్షత్రము యొక్క అతీతమైన ప్రాముఖ్యతను గుర్తించుటకు జ్ఞానులలోనున్న ఆత్మ మెళకువయు, శ్రద్ధతో గూడిన వారి అన్వేషణయు బేత్లెహేములోనున్న దీనమైన ఆ పశువుల పాక దగ్గరకు వారిని తీసుకొని వచ్చెను. అచ్చట వారు పొత్తిగుడ్డలతో చుట్టబడి, పశువుల తొట్టిలో పరుండి యున్న సర్వ సృష్టికర్తను చూచిరి. ఆయనను పూజించుటకు సాష్టాంగపడిరి. మహా ప్రీతితో తెచ్చిన తమ ఈవులను అనగా బంగారు, సాంబ్రాణి, బోళములను తమ కొరకేమియు దాచుకొనకుండా, సమస్తమును తెచ్చి ఆయన యెదుట నుంచిరి.

క్రీస్తు జననమును జ్ఞాపకము చేసుకొను ఈ సమయములో పలు రకములైన వాటిని కొనువారు, వినోద భోగములతో పండుగ నాచరింపవలయునను వాంఛ గలిగిన కోట్లకొలది మంది ప్రజలు ఆయనను వెదుకవలెననియు, చూడవలెననియు కూడా ఏ మాత్రం లక్ష్యం లేకుండా ఉంటున్నారు.

ఇప్పుడును మరియమ్మను పూజించుటయు, తళతళ లాడుచు మెరయుచున్నట్టి వస్త్రములు వెదకుటయు మాత్రమే అన్నట్టుండుట ఎంత విచారము! మనుష్యులను తమ పాపముల నుండియు, వ్యర్థమైన భోగముల నుండియు రక్షించుటకే లోకమునకు వచ్చిన ప్రభువును వెదకకుండుట ఎంత భయంకరము!

ప్రస్తుత కాల ప్రపంచములోనున్న హృదయములు జీవం గల దేవుని యెడలను, ఆయన మాత్రమే అనుగ్రహించగలిగిన ఆ మహా గొప్ప రక్షణ విషయము లోను చాలా మొద్దుబారియున్న రీతిగా కనబడుచున్నది. ఆధునిక ప్రపంచములోనున్న కట్టులేని భోగాసక్తియైన ఇంద్రియ సుఖ నిరత్వము వలన అనేక గృహములు సన్మార్గ విషయములోను, ఆత్మీయముగాను విరిగి, విచ్ఛిన్నమగునట్లుగా చేయుచున్నవి.

కాబట్టి పురోభివృద్ధికి రాగలిగిన మహా మేధావులైన యౌవనులు అపవిత్రమైన వాతావరణములో జీవించుచు, చలించుచు దాని ఉనికి కలిగియుంటున్నారు. లోభత్వమనునది మరణమును కలిగించు పుండువలె, ఈ దినములలో నున్న స్త్రీ పురుషుల యొక్క హృదయములలో పుట్టి క్రీస్తు ప్రభువు విషయములో వారి యొక్క జ్ఞానేంద్రియములను చనిపోవునట్లు చేసినది. క్రీస్తు జననమును గుర్తు చేసుకొనే ఈ సమయములో అట్టి వారందరును రక్షకుని కనుగొందురు గాక! **– ఎడిటర్**

**యౌవనులకు :**

# సమీప బంధువు బోయజు

**"నయోమి పెనిమిటికి బంధువుడొకడుండెను. అతడు చాల ఆస్తిపరుడు, అతడు ఎలీమెలెకు వంశపువాడై యుండెను. అతని పేరు బోయజు".** (రూతు 2:11)

బోయజు అనగా 'బలవంతుడు' అని అర్థము! ఇతడు ఎలీమెలెకు వంశస్థుడు. ఇతడు తన పేరుకు తగినట్లే విడిపించగల బలవంతుడు. బలవంతుడైన దేవునిని కలిగిన ప్రజలు బలవంతులుగానే ఉంటారు. తన బలము గల హస్తముతో విడిపించగల దేవుని గలవారు విడిపించేవారిగానే ఉంటారు. యెహోవాయందు ఆనందించుట వలన వారు బలము పొందుతారు.

బోయజు ఆస్తిపరుడు. సర్వసృష్టికర్తయైన దేవుని బిడ్డలు ఆస్తిపరులే! "వెండి నాది బంగారము నాది" (హగ్గయి 2:8); "అడవి మృగములన్నియు వేయికొండల మీది పశువులన్నియు నావే గదా... లోకమును దాని పరిపూర్ణతయు నావే" (కీర్తన 50:10-12) అన్న దేవుని బిడ్డలు అన్నీ కలిగియుంటారు.

ఈ బోయజు యౌవనుడు, భక్తిపరుడు! అతడు తన చేనిలో పనిచేయు వారిని కలిసినప్పుడెల్లా, 'యెహోవా మీకు తోడైయుండును గాక' అని దీవించువాడు. ఇరువురు కలిసినప్పుడు దేవుని ఘనపరచుట ఈనాడు అరుదుగా కనబడుచున్నది. ఒకరికి ఒకరు వందనములు చేసికొనుట, ఒకరిని ఒకరు దీవించుకొనుట, ఒకరితో ఒకరు ఆనందించుట దైవభక్తి గలవారి సుగుణాలు!

బోయజు ప్రేమగలవాడు. అతడు తన పొలములో పరిగెను ఏరుకొంటున్న మోయాబీయురాలైన రూతును చూచినప్పుడు ఆమెపై జాలిపడెను. ఆమెతో ప్రేమగా మాట్లాడి – "నా కుమారీ, ఇచ్చట నా పనికత్తెల యొద్ద నిలకడగా ఉండుము; నిన్ను ముట్టకూడదని యౌవనస్థులకు ఆజ్ఞాపించియున్నాను, నీకు దాహమగునప్పుడు కుండల యొద్దకు పోయి పనివారు చేదిన నీళ్లు త్రాగుమని చెప్పెను" (రూతు 2:8,9).

ఒక తల్లివలె, ఒక తండ్రివలె, ఒక సహోదరుని వలె ఆమె పట్ల ప్రేమ, బాధ్యత కలిగియుండెను. అవును! మన ప్రభువు తండ్రి లేనివారికి తండ్రియు, విధవరాండ్రకు న్యాయకర్తయునై యున్నాడు (కీర్తన 68:5); తల్లి అయినా మరచును గాని నేను నిన్ను మరువను అన్నవాడు (యెషయా 49:15). "నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా నుండును" (సామెతలు 17:17). అటువంటి సుగుణాలతో నిండినవాడిగా కనబడుచున్నాడు ఈ బోయజు!

భర్తను పోగొట్టుకొని; తల్లిదండ్రులను, జన్మభూమిని విడిచి అత్తతో పాటు కష్టనష్టాలను భరించుటకు బేత్లెహేముకు చేరిన రూతు; బోయజు తనపై చూపిన

ప్రేమకు ఆశ్చర్యపడగా, బోయజు ఆమె చేసిన తీర్మానాలకు దేవుడు ప్రతిఫల మిచ్చునని; ఆయన రెక్కల క్రింద ఆమెను సురక్షితంగా కాపాడి, దీవించునని ఆమెకు అభయమిచ్చెను.

ప్రేమకు అర్హులు కానివారిని ప్రేమించుట దేవుని స్వభావము! ఆయన కొరకు పోగొట్టుకొన్నవాటికి అనేక రెట్ల ప్రతిఫలమిచ్చుట దేవునికి వాడుక! "దేవుని రాజ్యము నిమిత్తమై యింటినైనను భార్యనైనను అన్నదమ్ములనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను విడిచిపెట్టిన వాడెవడును, ఇహమందు చాల రెట్లును పరమందు నిత్యజీవమును పొందకపోడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని" ప్రభువు అనెను (లూకా 18:29-30).

బోయజు ఆమె లేమి తీరునట్లు, ఆమెకు సమృద్ధి కలుగజేసెను. బోయజు మంచి ఉపకారి! అందుకే "నయోమి - బ్రదికియున్న వారికిని చచ్చినవారికిని ఉపకారము చేయుట మానని యితడు యెహోవా చేత ఆశీర్వదింపబడును గాక అని తన కోడలితో అనెను" (రూతు 2:20). "యేసుక్రీస్తు అందరికి ప్రభువు" (అపొ. కార్య. 10:36).

యౌవనస్థుడైన బోయజు, యౌవనస్థురాలైన రూతును చూచినప్పుడు ఆమెను కుమారిగా భావించి ప్రేమించెనే గాని, ఆమెను ఆశించలేదు. ఆమెను దేవుని ప్రేమతో ప్రేమించెనే గాని శరీర ప్రేమకు చోటివ్వలేదు. ఒక వ్యక్తి యౌవన కాలంలో తన యౌవన ఆశలను జయించలేకపోతే తన జీవితంలో మరెప్పుడూ జయము పొందలేడు.

బోయజు సమీప బంధువు, ఎలీమెలెకు వంశపువాడు గనుక రూతుకు రక్తసంబంధి! ఆ దినములలో ఒకడు సంతానము లేకుండా చనిపోతే అతని సహోదరుడు ఆమెను వివాహము చేసికొని, వంశాభివృద్ధి కలుగజేయవలసిన బాధ్యత ఉండెడిది (ద్వితీయో 25:5,6). ఆ ఆశతో రూతు నయోమి సలహాతో బోయజును కోరెను. బోయజు తన బాధ్యతను నెరవేర్చుటకు వెనుకాడలేదు, విధవరాలిని వివాహమాడుటకు సంశయించలేదు గాని; తన కంటె దగ్గర బంధువుడొకడు ఉన్నందున వారితో, పెద్దలతో ఆ విషయమును సంప్రదించెను.

దేవుని బిడ్డలు వెలుగు సంబంధులు, పగటి సంబంధులు గనుక రహస్యముగా, దొంగతనముగా చీకటిలో చేసే నిర్ణయాలకు, క్రియలకు ఇష్టపడరు. "నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలిగియుండునని" యేసుప్రభువు చెప్పెను (యోహాను 8:12). కనుక బోయజు ఇశ్రాయేలీయుల యెదుట తన బంధు ధర్మమును నెరవేర్చి రూతును పెండ్లి చేసుకొనెను. ఆమెకు ఒక కుమారుడు కలిగెను. అతని పేరే ఓబేదు!

బోయజు ఇక్కడ కూడా క్రీస్తును చూపిస్తున్నాడు. అన్యురాలైన రూతువలె మనమును అన్యులుగా ఉండగా; అవిధేయత వలన, దోషముల వలన సర్వమును పోగొట్టుకొనగా; సాతానుకు బానిసలమై వైధవ్యముతో విడనాడబడి యుండగా యేసుప్రభువు తన రక్తమిచ్చి మనలను విడిపించాడు. వధువు సంఘముగా మనలను సిద్ధపరచి, మనలను చేరదీయుటకై పెండ్లి కుమారుడుగా రాబోతున్నాడు.

బైబిలులో అనేకుల జీవితాల్లో ఒడిదుడుకులు, అస్థిరత, తప్పుదారి పట్టుట చూస్తున్నాము గాని; బోయజు జీవితం సాఫీగా, చక్కగా, ఆరంభము నుండి చివరి వరకు దేవుని చిత్తాన్ని, ఆయన ఉద్దేశ్యాలను నెరవేర్చిన వ్యక్తిగా కనబడుచున్నాడు. కనుక ప్రియ పాఠకా! నీ జీవితాన్ని ఆయనకు అప్పగించు! ఆయన నడిపించే మార్గములో అంతము వరకు నడిచి ఆయన ఉద్దేశ్యాలను నెరవేర్చు! **-యన్. జయపాల్**

**(ఇటువంటి బైబిలులోని 30 మంది యౌవనుల జీవితములను గూర్చి వ్రాయబడిన 'యౌవనుడా! నీ గమ్యమేది?' పుస్తకము కావలసినవారు రూ. 100/- పంపి, పొందగలరు!)**

## క్రీస్తును గురించిన ప్రవచనములు - వాటి నెరవేర్పు

❖ స్త్రీ సంతానముగా పుట్టుట! (ఆది 3:15; గలతీ 4:4)
❖ కన్యక గర్భమున జన్మించుట! (యెషయా 7:14; మత్తయి 1:18-25)
❖ బేత్లెహేములో జన్మించుట! (మీకా 5:2; మత్తయి 2:1)
❖ చిన్న పిల్లలు చంపబడుట! (యిర్మీయా 31:15; మత్తయి 2:16-18)
❖ ఐగుప్తుకు తరలిపోవుట! (హోషేయ 11:1; మత్తయి 2:14-15)
❖ మహాత్కార్యములు చేయుట! (యెషయా 35:5-9; మత్తయి 4:24)
❖ రాజుగా ఊరేగింపబడుట! (జెకర్యా 9:9; మార్కు 11:1-11)
❖ ముప్పై రూకలకు అమ్మబడుట! (జెకర్యా 11:12; మత్తయి 26:15)
❖ ఆ సొమ్ముతో కుమ్మరి పొలము కొనుట! (జెకర్యా 11:13; మత్తయి 27:3-8)
❖ అక్రమకారులలో ఒకడుగా ఎంచబడుట! (యెషయా 53:12; లూకా 22:37)
❖ గాయములను పొందుట! (జెకర్యా 13:6; యోహాను 20:27)
❖ ధనవంతుని సమాధిలో ఉంచబడుట! (యెషయా 53:9; మత్తయి 27:57-60)
❖ తిరిగి లేచుట! (కీర్తన 16:8-10; లూకా 24:5,6)
❖ క్రీస్తు రాకడ నెరవేరవలసియున్నది! (యెషయా 64:1; ప్రకటన 1:7)
❖ యేసు త్వరగా వచ్చుచున్నాడు! (జెకర్యా 14:4; ప్రకటన 22:7,12)

యేసుక్రీస్తు యొక్క ప్రవచనములను, వాటి నెరవేర్పులను గమనించి; యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల క్రీస్తు రాకడ సమయములో రెప్పపాటున మార్చబడి నిత్యము క్రీస్తుతో నుందువు! **- ఎడిటర్**

జాగృతి :

# కంప్యూటర్లో కంప్యూటర్లు

- దేవుడు మానవుని కిచ్చిన వరాలలో జ్ఞాపక శక్తి యన్నది అద్భుతమైనది!
- లక్షలాది సంగతులను క్రమబద్ధంగా దాచుకొని, అవసరమైనప్పుడు వాటిని గుర్తు చేసుకొనే అత్యాశ్చర్యకరమైన శక్తి మన కున్నది!
- మెదడు కొన్ని లక్షల పుస్తకాలకు సరిపడే విషయాలను నిలువచేయగలదు. దాని యెదుట ఆధునిక కంప్యూటర్ల నిల్వశక్తి అపరిగణనీయము!
- 250 సింఫోనీలు, 100 ఒపెరాలకు అవసరమైన వాయిద్యాల ప్రతి సంగీత స్వరాన్ని కంఠస్థం చేయడం ద్వారా ఈ సత్యాన్ని ఆర్ టు గోటోస్ కనిని అన్న సంగీతకారుడు నిరూపించాడు!
- ఈ రోజుల్లో క్షణం క్షణం పెరిగిపోతున్న కంప్యూటర్ల ద్వారా రైల్వే టికెట్స్ రిజర్వేషన్ మొదలు వాతావరణ పరిశోధనలు, పరీక్ష ఫలితాలు, వ్యాధి నిర్ణయాలు ఒకటేమిటి? ప్రతీది కంప్యూటర్ల ద్వారా చేయించగలుగుచున్నారు.
- కంప్యూటర్లన్నీ ఒకవేళ బంద్ చేస్తే ప్రపంచమే స్థంభించిపోతుందేమో! ప్రపంచంలో నూటికి 70 మంది ప్రాణాలు కోల్పోతారు! కంప్యూటర్లు లేకపోతే ఈ రోజుల్లో ఏ పనులు జరుగవు!
- కంప్యూటర్లు ఏ విధమైన తప్పులు చేయవని శాస్త్రజ్ఞులు, విజ్ఞాన వేత్తలు, ప్రభుత్వ అధికారులు ప్రతి పనిని ఈ కంప్యూటర్లకే అప్పగించుచున్నారు.
- విచిత్రమేమంటే కంప్యూటర్లకు కూడా ఇప్పుడు కొన్ని రోగాలు వస్తున్నాయి! కంప్యూటర్ వైరస్, బగ్ అనే రోగాలు! ఇందువలన ఇవి చేసే పొరపాట్లు కోకొల్లలు! గనుక ఈ కంప్యూటర్ల వల్లే చివరికి యుద్ధాలు కూడా రావచ్చునని విజ్ఞానులు తెలియజేస్తున్నారు!
- కంప్యూటర్లు కొన్ని తప్పుడు లెక్కలు వేసినందున దేశ దేశాల మధ్య పగ, ద్వేషాలు పెరుగవచ్చును!
- విమానాల, రైళ్ళ రాకపోకలలో తప్పుడు సమాచారాలు అందించినందున ఒక దానితో ఒకటి గుద్దుకొని, ఎన్నో నిండు ప్రాణాలు బలైపోవచ్చును! తప్పిదమైన పరీక్ష ఫలితాలు ప్రకటించినందున ఎంతోమంది యౌవనులు ఆత్మహత్యకు గురవ్వ వచ్చును! మనుష్యులు తప్పు చేస్తే శిక్షింపవచ్చు! మరి కంప్యూటర్ తప్పు చేస్తే....
- ఒక్కొక్క కంప్యూటర్ వేలకొలది ఉద్యోగస్థుల ఉద్యోగాలకు ముప్పు తెచ్చిపెడు తుంది. మనుష్యుడు కనిపెట్టినవన్నీ వాని మీదే పగ తీర్చుకొనును.

▼ ప్రకటన 13:15 నుండి 18 వచనముల వరకు చదవండి!

▼ విజ్ఞానం అనే ముసుగులో మానవుడు అడుగులేని అగాధములోనికి దూకుతున్నాడు. కాలములు గమనించి ప్రభువు వైపు తిరుగుము!

▼ దేవుడు మనలను యంత్రములు గాను, ప్రతిమలు గాను చేయలేదు గాని; తన ఆకారములో తన స్వరూపములో చేసియున్నాడని, సర్వసృష్టికి అధికారులుగా చేసియున్నాడని గుర్తించి; నీవు చేసుకొన్న ప్రతిమలపై, యంత్రాలపై, కంప్యూటర్లపై ఆధారపడక; నిన్ను చేసిన సృష్టికర్తపై నమ్మికయుంచుము! - యన్. జయపాల్

**(ఇటువంటి 85 వైజ్ఞానిక, చారిత్రాత్మక విశేషములతో నిండిన 'మీకు తెలుసా?' పుస్తకము కావలసినవారు రూ. 100/- పంపి, పొందగలరు!)**

# సేవకులకు పది ఆజ్ఞలు

1. నీ దేవుడనైన ప్రభువును నేనే; నేనే నిన్ను ఎన్నుకొని అభిషేకించితిని. నేను తప్ప వేరొక ప్రభువు నీకుండకూడదు!
2. నీ కొరకు పేరు సంపాదించుకోరాదు; ఈ లోక భోగములకు తలయొగ్గి ఈ లోకము నిమిత్తము పనిచేయకూడదు!
3. నీ ప్రసంగాలలో లేదా నీ సంభాషణలో నీ దేవుడైన ప్రభువు నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు!
4. విశ్రాంతి దినమున ఏ పనియు చేయకుండునట్లు జ్ఞాపకముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి సేవ చేయవలెను. ఏడవ దినము విశ్రాంతి దినము. ఆ ఏడవ దినము ఆలయ ఆరాధన తరువాత నీ కుటుంబముతో గడుపుచు విశ్రాంతి తీసుకొనుము!
5. నీ దేవుడైన ప్రభువు నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడ వగునట్లు ప్రభువు యొక్క సేవకు నిన్ను సమర్పించిన నీ తండ్రిని, నీ తల్లిని సన్మానించుము!
6. నీ మాటతో గాని లేక కలహముతో గాని ప్రభువు యొక్క సేవకుడెవరి నైనను హత్య చేయకూడదు!
7. చూపుల్లో గాని, తలంపుల్లో గాని లేదా క్రియలలో గాని వ్యభిచరింప కూడదు!
8. ఇంకొక సేవకుని మందను లేదా అతని కష్టార్జితమును దొంగిలకూడదు!
9. నీవు చేస్తున్న పరిచర్య విషయమై లేనిది ఉన్నట్లు చెప్పకూడదు!
10. వేరొక వ్యక్తి యొక్క పరిచర్యనైనను, ఆస్తినైనను, పేరు ప్రఖ్యాతులనైనను, అతని క్రింద పనిచేయువారినైనను లేదా అతనికి చెందిన దేనినైనను నీవు ఆశింపకూడదు!

– యన్. జయపాల్

సందేశం :

# మీరు శ్రేష్ఠులు కారా?

**"నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి".** (కీర్తన 139:14)

దావీదు యెష్షయి యొక్క కడసారి కుమారుడు. ఆ కారణం చేత దావీదు తన అన్నలతో కూడా లెక్కించబడదగినవాడు కాలేకపోయెను (I సమూయేలు 16:11). అయితే దావీదు తన తండ్రి గొఱ్ఱెలను నమ్మకముగా కాయుచుండెను. అంతేకాదు, దేవునితో సమయము గడుప నేర్చుకొనెను. దేవునితో సహవాసము కలిగియుండెను. సితారాతోను, కీర్తనలతోను అతడు దేవునిని స్తుతించుచుండెను. దావీదు స్తుతి కృతజ్ఞతలతో నింపబడి ఉండేవాడు. అతడు దైవ ప్రత్యక్షతలను పొంది ఎన్నో మనోహరమైన కీర్తనలను రచించి పాడెను. అతనిని ఇశ్రాయేలీయుల మీద రాజుగా చేయుట దేవునికి ఇష్టమైనది (I సమూయేలు 16:12). దేవుని యొక్క ఆశ్చర్యకరమైన సృష్టిని పరికించినప్పుడు దావీదు ఇలా పలికెను.

"నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు?" (కీర్తన 8:3,4). అయినను విశ్వమంతటికి సృష్టికర్తయైన దేవుడు మానవుని పైననే దృష్టియుంచియున్నాడు. మానవుని సృష్టి అంతటికి మకుటముగా చేసియున్నాడు. అల్పుడైన మానవుని సృష్టి అంతటికంటె ఎక్కువగా ప్రేమిస్తున్నాడు, ఎన్నిక చేస్తున్నాడు. మానవుడు తనను సృజించిన దేవునితో సజీవమైన, నిరంతరమైన సహవాస సంబంధాలు కలిగియుండేలాగున దేవుడు తన స్వరూపమందు, తన పోలిక చొప్పున మానవుని సృష్టించాడు. అందుకే దావీదు "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును, ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందునుబట్టి నేను నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను" (కీర్తన 139:14).

ఈనాటి వైద్యశాస్త్రం ముడులు విప్పుతున్న అతి క్లిష్టతరమైన మానవ శరీర అద్భుతాలను పరిశీలించినచో 'భయమును, ఆశ్చర్యమును కలుగు రీతిగా నేను నిర్మింపబడితినే' అన్న దావీదు రాజు మాటలు ఎంత సమంజసమో తెలియుచున్నది. భౌతికమైన రూపంలో మానవ శరీర యంత్రాంగము ఎంత ఆశ్చర్యముగా పనిచేస్తుందో పరిశీలిద్దాం!

❖ **మెదడు :** మానవుని మెదడు ఒక్కొక్కటి 0.1 ఓల్టుల విద్యుచ్ఛక్తితో పనిచేసే వంద మిలియన్ల నాడీ కణ జాలాన్ని కలిగియున్నదని డాక్టర్లు అంచనా వేసారు. మానవ మెదడుతో సమమైన ఒక విద్యుత్ పరికరమును తయారుచేసినట్లైతే, అది ఉంచబడిన భవనం ప్రపంచంలోకెల్లా అతి పెద్ద భవనం అవుతుంది. మరియు అది పనిచేయడానికి ప్రపంచంలోని అతి పెద్ద జలపాతం

ద్వారా ఉత్పత్తి చేయబడిన విద్యుత్‌నంతటిని వినియోగించుకొంటుంది. అబ్బా! చూసారా! మన మెదడు ఎంత ఆశ్చర్యమైనదో!

❖ **కన్ను:** మానవుని యొక్క కన్ను 130 బిలియన్ల 'రాడ్స్' అను కణములు, 7 మిలియన్ల 'కోన్' అను కణములు కలిగియుండి, మూడు లక్షల మెదడు నాడీ కణములతో అనుసంధించబడి యున్నది. యాంత్రికంగా మానవుని నేత్రమును నిర్మించాలంటే, దానికి రెండున్నర లక్షల టెలివిజన్ ట్రాన్స్‌మిట్టర్‌లు, రెండున్నర లక్షల టెలివిజన్ రిసీవర్‌లు అవసరమవుతాయి! ఆహాఁ! ఎంత ఆశ్చర్యం!

❖ **చెవి :** మానవుని చెవిని పియానోతో పోల్చినట్లైతే; పియానోలో 88 మెట్లు ఉండగా, మానవుని చెవిలో పదిహేను వేల మెట్లు ఉన్నవని చెప్పవచ్చును. వేరొక మాటలో చెప్పాలంటే మానవుని చెవి అత్యంత సునిశితమైన గ్రహణ శక్తి కలిగి; పియానోలోని ఏ రెండు మెట్ల మధ్య అయినా పది సంగీత నాదాలను అధికంగా గ్రహించగలదు. ఎంత అద్భుతం!

❖ **గుండె :** మన శరీరములో దేవుడు పెట్టిన గుండె ప్రతి నిమిషానికి డెబ్బై రెండు సార్లు కొట్టుకొంటూ విశ్రాంతి తీసుకొనకుండా సంవత్సరానికి నాలుగు కోట్ల సార్లు కొట్టుకొంటుంది. నీవు గ్రహించినా, గ్రహించకపోయినా నీ గుండె రోజుకి లక్ష కంటె ఎక్కువ సార్లు కొట్టుకొంటుంది. మరి మనం జీవిస్తున్నామంటే ఇది అద్భుతం కాదా?

దేవుడు మానవ దేహంలో నిర్దిష్టమైన నిర్మాణాన్ని, సున్నితమైన యంత్రాంగాన్ని నిర్మించి; వాటి మధ్య సమతుల్యత ఉండేలా క్రమంగా అమర్చడం అద్భుతం కాదా? మానవునికి అనుభూతులను అనుభవించే, నిర్ణయాలు తీసుకొనే వివేకం కలిగిన మనస్సు ఉన్నది. అవును! మానవుడు సంక్లిష్టంగా నిర్మించబడిన శరీరంతో పాటు మరింత అద్భుతమైన వివేకముతో కూడిన మనస్సును కలిగియున్నాడు.

అయితే ఈ రెండింటి కంటె ఇంకా లోతైనది, అద్భుతమైనది మరియొకటి ఉన్నది. అదే అతని ఆత్మ! ఈ ఆత్మ మానవుడ్ని జీవరాసులన్నిటి కంటె ఉత్తమమైన వానిగా చేయుచున్నది. దేవుని యొక్క ఉనికిని చాటే మిగిలిన సృష్టముల వలెనే ఆ ఆత్మ కూడా దేవుడున్నాడని నిరూపించుచున్నది.

మానవుని జీవితము భూసంబంధమైన కాల పరిస్థితులచే పరిమితం చేయబడలేదు. అయితే పాపము ఈ లోకములోనికి వచ్చుట వలన పాప ఫలితంగా మరణము మానవుని జీవితమును పరిమితం చేసి ఏదో ఒకనాటికి మరణించవలసిన పరిస్థితి ఏర్పడెను. మానవుడు అద్భుతముగా నిర్మింపబడెను. కాని ఆత్మ దానిలో ప్రాముఖ్యమైనదియును, దేవుని భాగమును అయియున్నది. ఆత్మ శరీరాన్ని విడిచి పెట్టిన స్థితిని మరణము అంటారు.

మరణించిన తరువాత భౌతిక పదార్థముల రూపములో ఉండే మానవ శరీరమునకు వెల కట్టగలమా? రసాయనిక పరీక్షల ద్వారా విశ్లేషించినట్లైతే అది

సాధ్యమే! మానవ శరీరములో ఉండే భౌతిక పదార్థముల పరిమాణము ఈ విధముగా ఉన్నది!

- ◆ ఏడు సబ్బుల తయారీకి కావలసిన క్రొవ్వు!
- ◆ ఒక చిన్న మేకును తయారుచేయుటకు కావలసినంత ఇనుము!
- ◆ ఒక గుప్పెడు పంచదార!
- ◆ ఒక కోళ్ళ గూడుకు ఎల్లవేయుటకు చాలినంత సున్నము!
- ◆ ఒక బొమ్మ తుపాకీని పేల్చడానికి కావలసినంత పొటాషియం!
- ◆ కొంచెం మెగ్నీషియం!
- ◆ రెండువేల రెండువందల అగ్గిపుల్లల తయారీకి సరిపడు భాస్వరము!
- ◆ మరియు చాలా తక్కువ గంధకము!

ఈ పదార్థములన్నింటిని సుమారుగా రూ. 6-40 పైసలకు కొనగలమని కొన్ని సంవత్సరముల క్రితం అంచనా వేసిరి. అయితే జీవించుచున్న మానవుని శరీరములోని యంత్రాంగాన్ని కొనలేము గాని, కొనుటకు ప్రయత్నించినచో ఆరు మిలియన్ల డాలర్లు అనగా సుమారు రెండు కోట్ల డెబ్బై లక్షల రూపాయలు కావాలట!

మానవ శరీరాకృతి మానవుడు బ్రతికియున్నప్పుడు, చనిపోయినప్పుడు కూడా ఒకే విధంగా ఉంటుంది! కాని చనిపోయినప్పుడు ఆ శరీరములో నుండి ఏదో పోయి ఉంటుంది. అలా పోయినదే ఆత్మ! జీవమునిచ్చే ఆ ఆత్మ మనలో ఉన్నప్పుడు మన విలువ ఆరు మిలియన్ల డాలర్లు! అది పోయినప్పుడు ఆరు రూపాయలు! అనగా మన శరీరము విలువ ఇంచుమించు ఆరు రూపాయలు, ఆత్మ విలువ ఇంచుమించు ఆరు మిలియన్ల డాలర్లు! మానవుని జీవించే ప్రాణిగాను, వ్యక్తిగాను చేసేది ఆత్మ! ఎప్పుడైతే ఆత్మ శరీరం నుండి వేరవుతుందో అప్పుడు మన శరీరము కోడిగ్రుడ్డు డొల్లతో సమానం! దానికి విలువ లేదు.

అవును! శరీరము క్షయమైపోవునది. కాని, దానిలో నున్న కంటికి కనిపించని ఆత్మ అక్షయమైనది మరియు సృష్టికర్తయైన దేవునికి చెందినది. "మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7) అని బైబిలు చెప్పుచున్నది.

ఈ రోజుల్లో మనుష్యులు తమ దేహాన్ని, మేధస్సును ఈ లోక సంబంధమైన వాటితో నింపుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నారు. కాని తమలో ఉన్న ఆత్మను గురించి పూర్తిగా విస్మరిస్తున్నారు. అయితే వారి ఆత్మ సృష్టికర్త అయిన దేవునితో సంబంధము కలిగియుండేంత వరకు తృప్తిచెంద నేరదు; శాంతి, సంతోషాన్ని కలిగియుండనేరదు. మనిషి జీవితంలో విరక్తిని కలిగించి, నిర్వీర్యుణ్ణి చేసే శూన్యత యున్నది. మనిషి తనలోని శూన్యతను ఈ లోక సంబంధములైన సుఖములు, నాగరికతలతో నింపుకోవడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని అదంతా వ్యర్థ ప్రయాసమే! అది లైంగిక సుఖమే కానీయండి, సంపద లేక

గౌరవ ప్రతిష్ఠలే కానీయండి; అంతిమ ఫలం విరక్తియే! సరియైనదానితో కాకుండా ఇతరమైనవి ఎన్నింటితోనైనను ఒకడు తృప్తి చెందనేరడు కదా!

"మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27); "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (I కొరింథీ 5:10) అని బైబిలు హెచ్చరిస్తున్నది.

మరియు యేసు–"పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాస ముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" (యోహాను 11:25,26) అని చెప్పెను.

మన పాపముల కొరకు చనిపోవడానికి, మనలను మరణం నుండి విడిపించడానికి యేసుక్రీస్తు ఈ లోకంలోనికి వచ్చెను. యేసు తన స్వంత రక్తము చేత మరణమును జయించెను. "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణ భయముచేత దాస్యము నకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడ రక్తమాంసములలో పాలి వాడాయెను" (హెబ్రీ 2:14,15).

"ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ? మరణపు ముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే. అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక" (I కొరింథీ 15:55-57).

పాపమును గూర్చి బైబిలు చేస్తున్న హెచ్చరికను నీవెరుగుదువా? "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). నీవు ఇష్ట పూర్వకముగా చేసిన పాపము మూలముగా దేవుడిచ్చిన బహుమానమైన నీ దేహాన్ని నీవు పాడుచేసు కున్నావనే నిజమైన పశ్చాత్తాపము, ఆత్మీయ ఒప్పుకోలు నీకున్నట్లైతే నీకున్న చివరి ఆశ మరియు ఆశ్రయము ఏమిటంటే నీ పాపములను భరించిన యేసుక్రీస్తు యొక్క రక్షించే హస్తాన్ని వెదకడమే!

తాను కల్వరి సిలువపై చేసిన బలియాగము ద్వారా పాపపు అగాధమును పూడ్చివేసెను. పాపము, మరణములపై ఆయన సాధించిన శాశ్వతమైన విజయము ఇంకనూ నీకు అందుబాటులోనే యున్నది. విశ్వాసము ద్వారా దానిని ఉచితముగా స్వంతము చేసికొనుము. అప్పుడు నీవును దావీదు వలె – "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును, ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందునుబట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" అని చెప్పగలవు. **– యన్. జయపాల్**

## ధ్యానం : బైబిలంతటిలో మన యేసయ్య

- ఆదికాండములో ఆయనే మన జీవన శ్వాస
- నిర్గకాండములో ఆయనే మన విడుదల కొరకైన పస్కా గొఱ్ఱెపిల్ల
- లేవీయకాండములో ఆయనే మన ప్రధాన యాజకుడు
- సంఖ్యాకాండములో ఆయన మనకు జీవజలము నిచ్చే బండ
- ద్వితీయోపదేశకాండములో ఆయన మనకై వచ్చిన మోషే వంటి ప్రవక్త
- యెహోషువలో ఆయన మనకు రక్షణనిచ్చే సేనాధిపతి
- న్యాయాధిపతులులో ఆయనే మన న్యాయాధిపతి మరియు విమోచన దాత
- రూతులో ఆయనే మన బంధువుడైన విమోచకుడు
- సమూయేలు మొదటి, రెండు గ్రంథాలలో ఆయన మన విశ్వసనీయ ప్రవక్త
- రాజులు మొదటి, రెండు గ్రంథాలలోను మరియు దినవృత్తాంతములు మొదటి, రెండు గ్రంథాలలోను ఆయన మనలను పరిపాలించే రాజు
- ఎజ్రా, నెహెమ్యాలలో ఆయన విరిగిన మరియు పతనమైపోయిన మానవ జీవిత గోడల పునర్నిర్మాణకుడు
- ఎస్తేరులో ఆయనే మన మొర్దెకై (ఉత్తరవాది)
- యోబులో ఆయనే మన సజీవుడైన విమోచకుడు
- కీర్తనలులో ఆయన మన కాపరి
- సామెతలు మరియు ప్రసంగిలో ఆయన మన జ్ఞానము
- పరమగీతములో ఆయనే మన యెడల ప్రేమగల పెండ్లి కుమారుడు
- యెషయాలో ఆయనే మన సమాధాన రాజు
- యిర్మీయాలో ఆయనే మన నీతిగల కొమ్మ
- విలాప వాక్యములులో ఆయన మన కొరకై విలపించే ప్రవక్త
- యెహెజ్కేలులో ఆయన వింతైన నాలుగు ముఖములు గల మానవుడు
- దానియేలులో ఆయనే మండుచున్న కొలిమిలో ఉన్న నాలుగవ వ్యక్తి
- హోషేయలో ఆయన ఎప్పటికిని వెనుకబడినవారితో వివాహం (నిబంధన) చేసుకొనే విశ్వసనీయమైన భర్త
- యోవేలులో ఆయన పరిశుద్ధాత్మతోను, అగ్నితోను బాప్తిస్మమిచ్చువాడు
- ఆమోసులో ఆయనే మన భారములను భరించేవాడు
- ఓబద్యాలో ఆయనే రక్షించుటకు శక్తి గలవాడు
- యోనాలో ఆయన మన గొప్ప విదేశీ మిషనెరీ (ఒక ప్రత్యేకమైన పని కొరకు పంపబడినవాడు)
- మీకాలో ఆయనే సువార్తను ప్రకటించే సుందర పాదములు గల దూత
- నహూములో ఆయనే మన బలము మరియు డాలు

- హబక్కూకులో ఆయన దేవుని సువార్తికుడు
- జెఫన్యాలో ఆయనే మన రక్షకుడు
- హగ్గయిలో ఆయనే దేవునిలో కోల్పోయిన వారసత్వాన్ని పునరుద్ధరించేవాడు
- జెకర్యాలో ఆయనే పాపమును, అపవిత్రతను తొలగించుటకు దావీదు ఇంటిలో తెరువబడిన ఊట
- మలాకీలో ఆయనే మన నీతిసూర్యుడు, అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును
- మత్తయి సువార్తలో ఆయన యూదుల రాజు
- మార్కు సువార్తలో ఆయన సేవకుడు
- లూకా సువార్తలో ఆయనే మీరు ఏమని భావిస్తారో (అనుభూతి చెందుతారో) అవన్నియు భావించగల (అనుభూతి చెందగల) మనుష్య కుమారుడు
- యోహాను సువార్తలో ఆయన దేవుని కుమారుడు
- అపొస్తలుల కార్యములులో ఆయనే ప్రపంచాన్ని రక్షించేవాడు
- రోమీయులకు వ్రాసిన పత్రికలో ఆయనే దేవుని యొక్క నీతి
- కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో ఆయనే ఇశ్రాయేలీయులను వెంబడించిన బండ
- కొరింథీయులకు వ్రాసిన రెంవ పత్రికలో ఆయనే జయము నిచ్చు విజయశాలి
- గలతీయులకు వ్రాసిన పత్రికలో ఆయనే మనకు స్వతంత్రత నిచ్చేవాడు
- ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో ఆయనే సంఘమునకు శిరస్సు
- ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో ఆయనే మన ఆనందము
- కొలొస్సయులకు వ్రాసిన పత్రికలో ఆయనే మన సంపూర్ణత
- థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి మరియు రెండవ పత్రికలలో ఆయనే మన నిరీక్షణ
- తిమోతికి వ్రాసిన మొదటి పత్రికలో ఆయనే మన విశ్వాసము
- తిమోతికి వ్రాసిన రెండవ పత్రికలో ఆయనే మన స్థిరత్వము
- తీతుకు వ్రాసిన పత్రికలో ఆయనే సత్యము
- ఫిలేమోనుకు వ్రాసిన పత్రికలో ఆయనే మన శ్రేయోభిలాషి
- హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో ఆయనే మన వృత్తి
- యాకోబు వ్రాసిన పత్రికలో ఆయనే మన విశ్వాసమునకు మాదిరి
- పేతురు వ్రాసిన మొదటి పత్రికలో ఆయనే మన మొదటి ఉదాహరణ
- పేతురు వ్రాసిన రెండవ పత్రికలో ఆయనే మన పవిత్రత
- యోహాను వ్రాసిన మొదటి పత్రికలో ఆయనే మన జీవము
- యోహాను వ్రాసిన రెండవ పత్రికలో ఆయనే మనకు నమూనా
- యోహాను వ్రాసిన మూడవ పత్రికలో ఆయనే మన ప్రేరణ
- యూదా వ్రాసిన పత్రికలో ఆయనే మన విశ్వాసమునకు పునాది
- ప్రకటనలో ఆయనే రానైయున్న రారాజు

– ఎడిటర్

# నీ కిచ్చిన పిల్లల కొరకు!

**"నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షావల్లి వలె నుండును. నీ భోజనపు బల్ల చుట్టు నీ పిల్లలు ఒలీవ మొక్కల వలె నుందురు".** (కీర్తన 128:3)

ప్రతి క్రైస్తవ విశ్వాసురాలైన భార్య తానొక ద్రాక్షావల్లిని అన్న సంగతిని గుర్తించాలి! భర్తతో ఏకీభవిస్తూ ద్రాక్షావల్లి ఫలించునట్లుగా ఫలించాలి! అంతేగాక బిడ్డల విషయములో ప్రత్యేక శ్రద్ధ కలిగి వారిని ఒలీవ మొక్కల వలె ఎదుగునట్లు వారి నిమిత్తమై ప్రార్థించాలి! సాధారణంగా యౌవన కాలమందు వారు హృదయ వాంఛలతో జీవిస్తుంటారు. వారు మనకు కొన్నిసార్లు ముల్లుల్లా అనిపిస్తారు.

అట్టి సమయాల్లో బిడ్డలు దేవుడిచ్చిన బహుమానములని గుర్తించి, వారి పట్ల దేవుని సంకల్పములు నెరవేరునట్లు వారి కొరకు ప్రార్థించాలి! వారికి ఉపదేశము చేయాలి! కుమార్తెలు నగరునకై చెక్కబడిన మూలకంబముల వలె ఉండాలని, కుమారులు బలవంతుని చేతిలోని బాణములుగా ఉండాలని దేవుడు ఆశిస్తున్నాడు.

బిడ్డలే తల్లిదండ్రులకు అలంకారము! బిడ్డలు యోగ్యులై, ప్రయోజకులైతే తల్లిదండ్రులకు ఘనత వస్తుంది. అలాగాక, వారు తప్పుడు మార్గాలను అనుసరిస్తే వారిని బట్టి తల్లిదండ్రులకు అవమానము వస్తుంది. ఒలీవ మొక్క ఏపుగా, చక్కగా పెరుగుతుంది. దాని యొక్క తైలము అటు దేవునిని, ఇటు మానవులను సంతోష పరుస్తుంది అని దేవుని వాక్యము చెప్పుచున్నది. గనుక 'నా బిడ్డలు ఒలీవ మొక్కల వలె ఉండునట్లు వారిని మార్చు ప్రభువా' అని అడగాలి!

అప్పుడు దేవుడు నీ మధ్య నీ పిల్లలను ఆశీర్వదిస్తాడు. వారు దేవునిచే ఉపదేశింపబడతారు. వారిని, వారి సంతానమును కూడా తన సన్నిధిలో స్థిరపరుస్తాడు. గనుక నీవు భయపడక, దిగులు చెందక విశ్వాసముతో పెంచు!

అంతేకాదు, నీ బిడ్డల కొరకు కొంత ఆస్తిని సమకూర్చు! ఎందుకంటే మంచివారు తన పిల్లలను ఆస్తికర్తలుగా చేస్తారని, తండ్రులే పిల్లల కొరకు ఆస్తి సంపాదించాలని దేవుని వాక్యము చెప్పుచున్నది. ఒకవేళ నీవు ముందుచూపు లేక, నీ ఇష్టమొచ్చినట్లు జీవిస్తే అజ్ఞానం అవుతుంది. దేవుని యందలి విశ్వాసమే వారి గొప్ప ఆస్తియని వారు యెరుగునట్లు చేయి! ఎందుకంటే అబ్రాహామును దీవించి అతనితో ఉన్న దేవుడు ఇస్సాకు, యాకోబులతో కూడా ఉన్నాడు. మనం వెళ్ళిపోతాము గాని, దేవుడు ఎల్లప్పుడూ వారితో ఉంటాడు. దేవుడే వారికి ఆశ్రయమౌతాడు. ఎవ్వరూ దారి తొలగిపోరు, తొట్రిల్లరు. ఆయన కాపుదల, దయ, ఆయన ఆశ్రయము పిల్లలకు దయచేయుమని తల్లివైన నీవు, నీ ఊపిరి ఉన్నంతవరకు విశ్వాసముతో ప్రార్థించాలి!

– **శ్రీమతి సులోచన పాల్**

భక్తుల చరిత్ర: **ఛార్లెస్ టి. స్టడ్** (1862-1931)



ఛార్లెస్ టి. స్టడ్, ఎడ్వర్డ్ అనే ఒక ధనవంతుని కుమారుడు. చిన్నప్పటి నుండి ఎంతో సౌఖ్యముగా, ఆడంబరముగా పెరిగిన వాడు. వేటయందు, క్రికెట్ నందు, గుఱ్ఱపు పందెముల యందు ఆసక్తి కలిగినవాడు. తన 16 ఏళ్ళ వయస్సులోనే క్రికెట్ ఆటలో ప్రవీణుడయ్యాడు.

స్టడ్ అందమైన, దృఢమైన శరీరం గలవాడు. తన ఆట నేర్పరి తనమును బట్టి అతిశయించిన వాడు. అనేక గంటలు అద్దం ముందు గడిపేవాడు. ఈలోగా డి.యల్. మూడీ అనే దైవజనుడు జరిపించిన కూటముల ద్వారా స్టడ్ తండ్రి పశ్చాత్తాపపడి, మారుమనస్సు పొందెను. స్టడ్ తండ్రి 'ఎడ్వర్డ్' గుఱ్ఱపు పందెములను, ఆడంబరములను వదిలిపెట్టి క్రీస్తు కొరకు జీవించ నిర్ణయించుకొన్నాడు.

తన ఇంటిలో పెద్ద గదిని ఖాళీ చేసి, సువార్త ప్రకటించుటకు వాడుచుండెను. తన ముగ్గురు కుమారులు కూడా రక్షించబడాలని ప్రార్థించాడు. స్టడ్, మూడీ గారి ద్వారా సువార్తను విన్నప్పుడు కదిలించబడెను. గాని తన హృదయాన్ని దేవుని కిచ్చుటకు వెనుకాడుచుండెను. ఈలోగా స్టడ్ సహోదరుడైన 'జార్జి' బహు వ్యాధిగ్రస్థుడై పడక మీద ఉండుట చూచినప్పుడు ఛార్లెస్‌కు గొప్ప కనువిప్పు కలిగెను. ఈ లోకపు అందచందాలు, ఆస్తిపాస్తులు తాత్కాలికమైనవని, ఆధ్యాత్మిక జీవితము ఎంతో విలువైనదని గ్రహించుకొనెను. ఆ సమయంలో డి.యల్. మూడీ గారు ఒకచోట జరిపిస్తున్న విద్యార్థుల కూటములకు హాజరై, అచ్చట తన జీవితమును క్రీస్తునకు పూర్తిగా అప్పగించెను.

అప్పటికి అతను బి.ఏ. ముగించి, తానొక న్యాయవాదినవ్వాలనే కోరికతో ఉండెను. కాని అతను రక్షించబడిన తరువాత 'ప్రపంచంలో వేలకొలది ఆత్మలు నశించుచుండగా; లోక ఘనతను, ఆనందమును ఆశించి, నా జీవితమును ఎట్లు వృథాపరచుకొనగలను' అనుకొని, క్రీస్తు కొరకు మిషనెరీగా వెళ్ళగోరెను. తన క్రికెట్ ఆటను, చదువును, తల్లిదండ్రులను, ఆస్తిని విడిచిపెట్టి; యేసును వెంబడించ నిశ్చయించుకొనెను.

క్రికెట్ ఆటలో ప్రఖ్యాతి గడించినవారు, స్టడ్ నెరిగినవారు అనేకులు ఉండిరి. గనుక స్టడ్ వారి యొద్దకు వెళ్ళి, యేసుక్రీస్తు తనను ఏలాగు మార్చెనో సాక్ష్యమిచ్చు చుండగా అనేకులు విని ఆశ్చర్యపడుచుండిరి. తన జీవితములో మిషనెరీగా ఎక్కడికి వెళ్ళవలెనో ప్రార్థించుచుండగా "నన్నడుగుము జనములను నీకు స్వాస్థ్యముగాను, భూమిని దిగంతముల వరకు సొత్తుగాను ఇచ్చెదను" (కీర్తన 2:8) అను స్వరమును మాటిమాటికి వినుచుండెను. సువార్త అందని కోట్లకొలది ప్రజలు ఉన్న చైనా దేశమునకు దేవుడు తనను వెళ్ళమనుచున్నాడన్న గ్రహింపు కలిగెను.

అయితే అతని తల్లిదండ్రులు, స్నేహితులు అతడు ఇంగ్లాండ్ దేశములోనే సేవ చేయవలెనని ఎంతో బ్రతిమిలాడినప్పటికిని తాను దేవుని చిత్తము చేయవలెనని స్టడ్ బయలుదేరి 1885 ఏప్రిల్ 1వ తేదీన చైనా దేశం చేరెను. ఆ దేశంలో షాంగై పట్టణం చేరి, దినమునకు 7 గంటలు కష్టపడి చైనా భాషను నేర్చుకొనెను. ప్రతిరోజు ఇంచుమించు 40 మైళ్ళ చొప్పున నడిచి సువార్తను ప్రకటించెను. తన పాశ్చాత్య మార్గాలను వదిలి; వస్త్రధారణలోను, భోజన విషయాలలోను చైనా దేశస్థులను అనుసరించెను.

విశ్వాసముతో ఎన్నో కష్టాలను ఓర్చుకొనుచు, ఆత్మల రక్షణార్థమై ప్రయాసపడు చుండెను. ఈలోగా తన తండ్రి మరణించెననియు, ఆస్తిలో తనకు వచ్చిన భాగము విడిచిపెట్టి వెళ్ళెననియు ఉత్తరం వచ్చెను. స్టడ్ ఆ ధనమును ప్రేమించక, "నీకు కలిగినది అమ్మి బీదలకిమ్ము" అన్న దేవుని మాటకు విధేయతగా, తన ఆస్తిలో కొన్ని వేల డాలర్లను తాను రక్షించబడుటకు కారణమైన డి.యల్. మూడీ గారి సేవకు, మరికొన్ని వేల డాలర్లు అనాథ పిల్లలకు సేవ చేయుచున్న జార్జి ముల్లర్ గారికి, మరికొన్ని డాలర్లను పేద ప్రజల మధ్య సేవ చేసే విలియం బూత్ స్థాపించిన రక్షణ సైన్యమునకు, మరి ఇతర సేవకులకు పంచి ఇచ్చెను. ఇయ్యుడి మీకియ్యబడు నన్నట్లుగా ఆయనే ఒక చిన్న మిషనెరీగా ఉండి, అనేక సేవకులకు ఇచ్చినందున దేవుడాయనను అత్యధికంగా దీవించెను. అతని పరిచర్యలలో ఎప్పుడూ, ఏ లోటూ కలుగలేదు.

స్టడ్ చైనా వెళ్ళిన 3 సంవత్సరముల తరువాత 'ఐరిష్' దేశమునకు చెందిన మిషనెరీ అయిన 'ప్రిస్కిల్లా స్టేవార్డ్' అనే భక్తి కలిగిన యువతిని వివాహం చేసుకొనెను. దేవుడు వారిని దీవించి అయిదుగురు బిడ్డల నిచ్చెను. అనేక కష్టనష్టాల నోర్చుకొని, చేయుచున్న 7 సంవత్సరముల పరిచర్య తరువాత 800 మంది స్త్రీలు, పురుషులు రక్షించబడిరి. ఈలోగా అతని ఆరోగ్యం బహుగా దెబ్బ తిన్నందున వ్యాధిగ్రస్థుడైన స్టడ్ ఇంగ్లాండ్ దేశమునకు తిరిగి వెళ్ళవలసి వచ్చెను. ఆలాగు 6 సంవత్సరములు ప్రార్థనలో గడిపెను.

అతని ఆరోగ్యము కుదుటపడిన తరువాత తిరిగి అతడు దక్షిణ భారత దేశమునకు మిషనెరీగా వచ్చి, అక్కడ కొంత పరిచర్య చేసెను. మిషనెరీ సేవలో ఉన్న అనేక ఇబ్బందులను బట్టి; సరైన ఆహారము, నీరు సమయానికి దొరుకనందున, విశ్రాంతి లేనందున మరల వ్యాధిగ్రస్థుడై, తన దేశమునకు చేరి విశ్రాంతి తీసుకొనుచుండెను.

ఆ రోజుల్లో మనుష్యులను తినే ఆఫ్రికా వారికి మిషనెరీ కావలెననే ప్రకటన చూచెను. ఆఫ్రికాకు ఎంతోమంది ఆఫీసర్లు (సైనికాధికార్లు), వ్యాపారస్థులు వెళ్తున్నారు. మరి యేసుని గూర్చి చెప్పుటకు ఎవరూ వెళ్ళడము లేదెందుకు? అని ఆలోచిస్తుండగా, 'నీవు వెళ్ళు' అనే స్వరము స్టడ్‌కు వినిపించింది. 'ప్రభువా! నేను వృద్ధుడను, 15 సంవత్సరముల నుండి వ్యాధిగ్రస్థుడనై బాధపడుచున్నాను' అని అనగా; 'నేను నిన్ను స్వస్థపరచగలను! ఆఫ్రికా లాంటి చీకటి ఖండానికి నీవే వెళ్ళాలి' అని ప్రభువు స్వరము మరల వినిపించెను.

చేతిలో చాలినంత డబ్బు లేకపోయినా, శరీరంలో ప్రయాణం చేసేటంత ఆరోగ్యం లేకపోయినా తన ప్రాణాన్ని పానార్పణంగా యేసు కొరకు ధారపోయుటకే స్టడ్ తెగించి, యేసు కొరకు తన యౌవనమును, ఉన్నత స్థితిని ఒకప్పుడు త్యాగం చేసెను. చైనా కొరకు, ఇండియా కొరకు తన ఆస్తినంతా త్యాగం చేసెను. ఇదిగో ఇప్పుడు మనుష్యులను తినే ఆఫ్రికా ప్రజల కొరకు తన ప్రాణాన్ని త్యాగం చేస్తానంటూ సిద్ధపడెను. 'జూదమనేది మహా పిచ్చి, కాని దాని కంటె యేసు పిచ్చి మరీ గొప్పది! జూదగాడు జూదములో సమస్తమును కోల్పోయినట్లే, యేసు కొరకు మనకున్నదంతా త్యాగం చెయ్యాలి' అనేవాడు సి.టి. స్టడ్!

ఆఫ్రికా వెళ్ళనివ్వకుండా, అనేకులు అతనిని ఆటంకపరిచారు గాని; 'ప్రభువు నన్ను వెళ్ళమని చెప్పాడు, నేను వెళ్తున్నాను; అక్కడ నేనేమి చేయలేకపోయినా, ఇకమీదట రాబోయే మిషనెరీలకు ఒక మార్గదర్శిగా ఉంటాను. నా సమాధి సేవకులకు మొట్టమొదటి మెట్టుగా ఉండనివ్వండి. తన ప్రాణాన్ని కాపాడుకొనేవాడు దానిని తప్పక పోగొట్టుకొంటాడు' అన్నాడు.

స్టడ్ ఆఫ్రికా వెళ్ళి, దేవుని కృప వలన మరి 20 సంవత్సరాలు సేవ చేసెను. వేలకొలది ప్రజలను యేసునొద్దకు నడిపించెను. బైబిలును అనువదించెను. చివరికి వృద్ధాప్యములో 69వ యేట ఆఫ్రికాలో తన చిన్న గుడిసెలోనే మరణించి, ప్రభువు సన్నిధికి వెళ్ళెను. 'సైనికుడు, పరిశుద్ధుడు' అను మాటలు వ్రాయబడిన వస్త్రము సి.టి. స్టడ్ దేహముపై కప్పిరి.

– యన్. జయపాల్

**(ఇటువంటి 25 మంది భక్తుల/ మిషనెరీల జీవితములను గూర్చి వ్రాయబడిన 'కల్వరి యోధులు' మరియు 'సిలువ సాక్షులు' పుస్తకములు కావలసినవారు రూ. 175/- పంపి, పొందగలరు!)**

## క్రైస్తవులుగా చలామణి అవుతున్నవారి పరిస్థితి!

- ☆ 20% క్రైస్తవులనబడినవారు ప్రార్థన చేయరట!
- ☆ 25% క్రైస్తవులనబడినవారు బైబిల్ ధ్యానించరట!
- ☆ 30% క్రైస్తవులనబడినవారు చర్చికి వెళ్ళరట!
- ☆ 40% క్రైస్తవులనబడినవారు కానుకలు/ అర్పణలు ఇవ్వరట!
- ☆ 50% క్రైస్తవులనబడినవారి పిల్లలు సండేస్కూలుకు వెళ్ళరట!
- ☆ 60% క్రైస్తవులనబడినవారు ఆదివారం సాయంత్రం కూడికకు వెళ్ళరట!
- ☆ 70% క్రైస్తవులనబడినవారు మిషనెరీలను బలపరచరట!
- ☆ 75% క్రైస్తవులనబడినవారు సంఘ పరిచర్యలో పాలుపంచుకోరట!
- ☆ 80% క్రైస్తవులనబడినవారు వారం మధ్యలో జరిగే ప్రార్థనలో పాల్గొనరట!
- ☆ 90% క్రైస్తవులనబడినవారి ఇళ్ళల్లో కుటుంబ ప్రార్థనలు జరుగవట!
- ☆ 95% క్రైస్తవులనబడినవారు ఒక్క ఆత్మను కూడా రక్షణలోనికి నడిపించరట!

**మరి మీరు**? క్రీస్తును పోలి జీవించువారే క్రైస్తవులు అగుదురు గాని, మీరేమి క్రైస్తవులు? అందుకే "వ్రాయబడిన ప్రకారము మిమ్మును బట్టియే గదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది?" (రోమా 2:24). తస్మాత్ జాగ్రత్త!

– సెలెక్టెడ్

## సేవకుడంటే....

- ✶ సేవకుడంటే నిన్ను దేవునికి పరిచయం చేసేవాడు!
- ✶ సేవకుడంటే నువ్వు పరలోకంలో చేరేలా వాక్యం చెప్పేవాడు!
- ✶ సేవకుడంటే నీ మనసు మారేలా ప్రార్థన చేసేవాడు!
- ✶ సేవకుడంటే నిన్ను సమాజానికి నిర్దోషిగా నిరూపించుకొనేలా ప్రోత్సహించేవాడు!
- ✶ సేవకుడంటే నీ పాప దుర్బుద్ధులను పోయేలా నీకు సేవ చేసేవాడు!
- ✶ సేవకుడంటే నీ ప్రతి సంతోషానికి కారణమయ్యేవాడు!

కాబట్టి సేవకుడిని గౌరవించకపోయినా ఫరవాలేదు గాని, అవమానించకండి! సన్మానించకపోయినా ఫరవాలేదు గాని, తూలనాడకండి! కనీసం సేవకుడిని సేవకుడిగానైనా గుర్తించండి! అది మీ ఆత్మలకు ఆరోగ్యదాయకం మరియు క్షేమదాయకం!

– సెలెక్టెడ్

# ప్రేమలో స్వార్థం లేదు

1858 డిశంబరు 22న క్రీస్తును అంగీకరించిన 'ప్లాటీమాన్' అనే ఒక స్త్రీ తాను రక్షించబడిన వెంటనే తన సంపన్న జీవితానికి వీడ్కోలు చెప్పి, చైనా దేశమునకు మిషనెరీగా వెళ్ళి, యాభై సంవత్సరముల పాటు అక్కడ మిషనెరీగా పనిచేసింది. ఆమె త్యాగభరితమైన ప్రేమను ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'ఒకవేళ నాకు వెయ్యి జీవితాలుంటే వాటన్నిటిని చైనా స్త్రీల కోసము ఉపయోగిస్తాను' అనేది!

ఈనాడు అనేకులు కనుపరచే ప్రేమలో త్యాగము లోపించి ఉంది. 'ఏమి ఇవ్వాలా?' అనేది ప్రేమ; 'ఏమి పొందాలా?' అనుకొనేది స్వార్థము! ఈనాడు ప్రేమ కంటె స్వార్థమే 'ప్రేమ' అనే పేరుతో చలామణి అవుతున్నది.

యాభై శాతం మంది 'స్వార్థాన్ని విడనాడుట' అనే విషయంలో కొద్దిగా పరిచయం కలిగియున్నారు. అయినా వారు కూడా వారి నిస్వార్థం సరిగా గుర్తింపబడలేదనో లేక వేరే మరొక కారణం చేతనో దేవుడు వారికిచ్చిన బహుమానాన్ని పాడుచేసు కొంటున్నారు.

క్రిస్మస్ కాలంలో పరిపూర్ణమైన ప్రేమను కలిగియుందాం! ఫలితం కోసం ఎదురుచూడని విశ్వాస సహితమైన ప్రేమను సంపాదించుకొందాం! "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది" (I యోహాను 4:10).

–ఎడిటర్

# దేవునికి స్నేహితునిగా ఉండాలంటే...

- ప్రార్థించే వ్యక్తిగా నీవుండాలి! (యోబు 42:10; II సమూయేలు 15:32)
- విడువక ప్రేమించే వ్యక్తిగా నీవుండాలి! (సామెతలు 17:17)
- హత్తియుండు వ్యక్తిగా నీవుండాలి! (సామెతలు 18:24)
- మేలు కోరే వ్యక్తిగా నీవుండాలి! (సామెతలు 27:6)
- అన్యాయం చేయని వ్యక్తిగా నీవుండాలి! (మత్తయి 20:13)
- సంతోషపరచే వ్యక్తిగా నీవుండాలి! (యోహాను 3:29)
- దాపరికం లేని వ్యక్తిగా నీవుండాలి! (యోహాను 15:15)
- ప్రాణం పెట్టుటకు కూడా వెనుకాడని వ్యక్తిగా నీవుండాలి! (యోహాను 15:13)

(నిర్గమ 33:7-11; లూకా 12:4; హోషేయ 13:5 కూడా చదవండి!) –సెలెక్టెడ్

# ప్రభువా! నూతన కార్యము చేయుము!

"ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను ఇప్పుడే అది మొలుచును మీరు దాని నాలోచింపరా?" (యెషయా 43:19)

ప్రభువు చిత్తమైతే మనం మరో నూతన సంవత్సరంలోనికి ప్రవేశించనై యున్నాము! రాబోయే ఈ నూతన సంవత్సరములో ప్రభువు మనలో ఒక నూతన కార్యము చేయాలని ఆశిస్తున్నాడు! అందుకే "మునుపటివాటిని జ్ఞాపకము చేసికొనకుడి పూర్వకాలపు సంగతులను తలంచు కొనకుడి ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను ఇప్పుడే అది మొలుచును" (యెషయా 43:18,19) అని ప్రభువు అంటున్నాడు.

దేవుడు మన యెడల చేయదలచుకొన్న కార్యము ఇప్పుడే ప్రారంభమగునట్లు నూతన హృదయాన్ని, ఆశీర్వాదాన్ని నీకిచ్చి గొప్ప మార్పును తెచ్చును.

★ అనేక సంవత్సరాలు మోసగాడిగా ఉన్న యాకోబు, దేవునితో పెనుగులాడిన రాత్రి దేవుడు ఒక్క దెబ్బతో తుంటి నరమును విరుగగొట్టి అతనిలో ఒక నూతన కార్యము చేసెను. తెల్లవారునప్పటికి ఇశ్రాయేలుగా మారిన యాకోబు ఆనాటి నుండి దేవునితో నడిచెను. (ఆదికాండము 32:22-32)

★ లంచగొండిగా, ధనవంతుడిగా జీవిస్తున్న పొట్టి జక్కయ్య; క్రీస్తును చూడాలని చెట్టెక్కినప్పుడు, ఒక్క మాటతో అతని హృదయములో విశ్వాసమును కలుగజేసిన యేసుప్రభువు అతని ఇంటికి వెళ్ళెను. 'నేడు ఈ ఇంటికి రక్షణ వచ్చియున్నది' అని చెప్పెను. (లూకా 19:9)

★ గెరాసేనుల దేశములో కొన్ని వేల దయ్యములు పట్టి పీడించబడుతున్న వ్యక్తిని ఒక్క మాటతో గద్దించగా; దయ్యములు అతనిని వదలెను, అతడు స్వస్థచిత్తు డయ్యెను. (మార్కు 5:1-20)

★ అయిదుగురు భర్తలతో విసిగి వేసారిన జీవితము జీవిస్తున్న సమరయ స్త్రీ బావి దగ్గరకు వచ్చినప్పుడు; ప్రభువు ఆమెతో మాట్లాడగా, నూతన సృష్టిగా మార్చబడిన ఆమె ఊరిలోనికి వెళ్ళి సాక్ష్యమిచ్చెను. (యోహాను 4:1-42)

★ సంఘమును హింసిస్తూ, చెదరగొడుతూ యేసును ద్వేషిస్తున్న సౌలును దమస్కు రోడ్డులో ప్రభువు దర్శించగా; మనోనేత్రములు తెరువబడిన సౌలు, సిలువ వేయబడిన యేసును చూచెను. అప్పటి నుండి సిలువకు సాక్షిగా జీవిస్తూ, అనేకులను రక్షణలోనికి నడిపి, హతసాక్షి అయ్యెను. (అపో. కార్య. 9:1-20)

ఇప్పుడే క్రీస్తు నీలో ఒక నూతన కార్యము చేయాలని ఆశిస్తున్నాడు. నిన్ను నీవు ఆయనకు అప్పగించుకొనుము! ప్రతి రోజు ఆయన వాక్యము చదువుము, ప్రతి రోజు మోకరించి ప్రార్థించుము! ప్రతి వారము ఆలయమునకు వెళ్ళి ఆయనను ఆరాధించుము, నీ దశమభాగముల నిచ్చి ఆయనను ఘనపరచుము, క్రీస్తును గురించి సాక్ష్యమిమ్ము! నూతన హృదయమును కాపాడుకొమ్ము! - **యన్. జయపాల్**

బైబిలులోని పదాలకు :

# అర్థాలు తెలుసుకొందాం!

(గత సంచిక తరువాయి...)

426. ఎనోషు = మర్త్యుడు, మానవుడు (ఆది 4:26; లూకా 3:38)
427. ఎపఫ్రా = సౌందర్యవంతుడు, ఆకర్షణశక్తి గలవాడు (కొలొస్స 1:7)
428. ఎపఫ్రొదితు = మనోహరము, సౌందర్యవంతుడు (ఫిలిప్పీ 2:25; 4:18)
429. ఎప్ఫతా = తెరవబడును (మార్కు 7:34)
430. ఎప్లాలు = విజ్ఞాపన, జాగ్రత్త గలవాడు (I దిన 2:37)
431. ఎపైనెటు = స్తోత్రార్హుడు (రోమా 16:5)
432. ఎఫ్రాతా = ఫలవంతమైన స్థలము (ఆది 35:16; మీకా 5:2)
433. ఎఫ్రాయిము = రెండంతల వృద్ధి, రెండంతల ఫలము (ఆది 41:52)
434. ఎఫెసు = సంపూర్ణమైన ఉద్దేశ్యము గలది (అపొ. కార్య. 18:19)
435. ఎఫ్రోను = దూడకు సంబంధించినది, పల్లెటూరు (ఆది 23:9)
436. ఎబ్యాసాపు = కూటమునకు తండ్రి (I దిన 6:23; 9:19)
437. ఎబెదు = దాసుడు (న్యాయాధి 9:26,28)
438. ఎబెద్మెలెకు = రాజు దాసుడు (యిర్మీయా 38:7; 39:16)
439. ఎబెనెజరు = సహాయార్థమైన రాయి (I సమూయేలు 4:1; 7:12)
440. ఎబ్రోనా = దాటు స్థలము, సముద్ర తీరము (సంఖ్యా 33:34)
441. ఎమ్మాయు = మనస్ఫూర్తియైన ఆశ (లూకా 24:13)
442. ఎరస్తు = ప్రియుడు (అపొ. కార్య. 19:22; రోమా 16:23)
443. ఎరెకు = పొడుగు (ఆది 10:10)
444. ఎరుబ్బెషెతు = విగ్రహముతో పోరాడినవాడు (II సమూయేలు 11:21)
445. ఎల్జయలు = దేవుడు కర్త, దేవుని బహుమానము (I దిన 8:11,12)
446. ఎలాదా = దేవుడు అలంకరించినవాడు (I దిన 7:20)
447. ఎలాశా = దేవుడు సృజించెను (I దిన 2:39; 8:37)
448. ఎలాసాపు = దేవుడు సమకూర్చువాడు (సంఖ్యా 1:14)
449. ఎల్కానా = దేవుని స్వాధీనము, దేవుడు సృజించెను (I సమూ 1:1)
450. ఎల్జాబాదు = దేవుడనుగ్రహించెను (I దిన 12:12)
451. ఎల్దాదు = దేవుడే మిత్రుడు, దేవుడు ప్రేమించును (సంఖ్యా 11:26,27)
452. ఎల్దాయా = దేవుడు పిలిచినవాడు (ఆది 25:4; I దిన 1:33)
453. ఎల్నాతాను = దేవుడు దాత (II రాజులు 24:8; యిర్మీయా 26:22)
454. ఎల్నాయము = దేవుడు ఆనందకరుడు (I దిన 11:46)
455. ఎల్పాలెటు = దేవుడు తప్పించువాడు (I దిన 14:5)

**(సశేషం)** - **ఎడిటర్**

# కల్వరి ప్రేమధారల స్పైరల్ బౌండ్ బుక్స్

1985వ సంవత్సరములో ప్రారంభించబడిన 'కల్వరి ప్రేమధార' ఆధ్యాత్మిక పత్రిక, రెండు నెలల కొకసారి చొప్పున, సంవత్సరమునకు 6 పత్రికలుగా విడుదల అగుచున్నది. దీని ద్వారా బైబిలు పఠనమునకు, ప్రార్థనా జీవితమునకు, విశ్వాస జీవితమునకు మరియు సేవా పరిచర్యలకు సంబందించిన అనేక అంశాలతో పాటు భక్తుల/ మిషనెరీల జీవిత చరిత్రలను అందించుచున్నాము! చదివినవారు ఆధ్యాత్మికంగా బలపడుతూ, వారు పొందుచున్న మేళ్లను తెలియజేయుచున్నారు. గనుకనే గత 35 సంవత్సరములుగా ఈ పరిచర్యను కొనసాగించగలుగుచున్నాము!

ఈ పత్రిక ఒకసారి చదివినవారు ఇటువంటి పత్రికలన్నీ అనగా ఒక సంవత్సరములో వెలువడినవన్నీ మాకు కావాలి అని కోరినందున ఏ సంవత్సరానికి సంబంధించిన పత్రికలను ఆ సంవత్సరము స్పైరల్ బైండింగ్ చేయించి మీకు అందుబాటులో ఉంచాము! ప్రస్తుతము 2013, 2014, 2015, 2016, 2017 2018 మరియు 2019 సంవత్సరములవి మాత్రమే లభ్యమగును! మిగిలినవి లభ్యము కావని చెప్పటకు విచారిస్తున్నాము! వీటిని మీ ఇంట చిన్న లైబ్రరీగా చేసుకొని తీరిక సమయాల్లో చదువుకొని ఆధ్యాత్మికంగా బలపడుటకు ఎంతగానో సహకరించును!




**2013**




**2014**




**2015**




**2016**




**2017**




**2018**

మరియు **2019.** ఒక్కొక్క సంవత్సరపు బౌండ్ బుక్ వెల రూ. 150/-. ఇవన్నీ కావాలంటే అనగా 2013 నుండి 2019 వరకు మొత్తం ఏడింటిని రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చుతో పాటు **రూ. 700/- పంపి, పొందగలరు!**

మీరు M.O.లు పంపవలసిన చిరునామా :

**CALVARY, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.**

# కల్వరి దర్శనం టి.వి. కార్యక్రమాలు మీకు ఆశీర్వాదకరంగా ఉన్నాయా?

ప్రతిరోజు ఉదయం 6:30 ని॥లకు మా మూవీస్‌లోను; రాత్రి 7:00 గం॥లకు శుభవార్తలోను, 8:00 గం॥లకు ఆరాధన లోను తెలుగులో ప్రసారమగుచున్న కార్య క్రమాలు కొనసాగునట్లు ఈ పరిచర్యల ద్వారా మేలు పొందుచున్న మీరు ప్రార్థించండి! మీ విరాళములు పంపుట ద్వారా ఈ పరిచర్యలో పాలిభాగస్థు లవ్వండి!

దానితో పాటు ప్రతిరోజు హిందీ లోను, తమిళంలోను మరియు మల యాళం, బెంగాలీ, ఒరియా భాషలలో వారానికి ఒక కార్యక్రమం ప్రసారమగు చున్నవి! అంతేగాక కన్నడ, పంజాబీ, మరాఠీ, ఉర్దూ, రష్యన్ మొదలైన మరి కొన్ని భాషలలో టెలివిజన్ కార్యక్రమాలు త్వరలో ప్రారంభించాలని ప్రార్థిస్తున్నాము!

ఇట్టి భారభరితమైన పరిచర్యలలో మీరు కూడా పాలిభాగస్థులగునట్లు **రూ. 1,000/-** లేక **రూ. 10,000/-** లేక ప్రభువు మిమ్మును ప్రేరేపించిన కొలది మీ విరాళ ములను, కానుకలను పంపి, దైవాశీస్సులు పొందండి!

M.O. ద్వారా, D.D. ద్వారా, చెక్కు ద్వారా లేక **ఇప్పుడు అందరికీ అందుబాటు లోనికి వచ్చిన** Online Transaction **ద్వారా మీ విరాళములు పంపించవచ్చు! మరియు** Google Pay **ద్వారా కూడా పంపించవచ్చు!**

ఇంకా వివరములు కావాలంటే **(0) 89 39 39 39 39** నంబర్‌కు ఫోన్ చేయండి! లేక మీ పేరు, సెల్ నంబర్, విషయము ఈ సెల్ నంబర్‌కు SMS చేయండి!

*Published and Edited by* : **N. JAYAPAUL,** 105, Ramanayakan Street, Nungambakkam, Chennai - 600 034. Printed by : R. Veera Raghavulu at Padmalaya Printers, 8/17, Manali Road, Chennai - 600 021. *Editor* : **N. Jayapaul**

**ONLINE వివరములు :**

## Andhra Bank

**Name: JAYAPAUL FOUNDATIONS**
**Current A/c No: 207211100000229**
**I.F.S. Code No: ANDB0002072**
**Branch: Kodambakkam, Chennai-24.**

## State Bank of India

**Name: JAYAPAUL FOUNDATIONS**
**S.B. A/c No: 30699437837**
**I.F.S. Code No: SBIN0001444,**
**Branch: Kodambakkam, Chennai-24.**

## ICICI Bank

**Name: JAYAPAUL FOUNDATIONS**
**Current A/c No: 021205006901**
**I.F.S. Code No: ICIC0000212**
**Branch: Santhome, Chennai.**

## Google Pay

Jayapaul N
+91 95000 01111

**T.V. పరిచర్యకు మీ విరాళములు M.O.లు, D.D.ల ద్వారా పంపుటకు మా చిరునామా :**

**JAYAPAUL FOUNDATIONS,**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY, CHENNAI-600042**

# కల్వరి ప్రేమధార పాఠకులకు విజ్ఞప్తి!

1985వ సంవత్సరములో ప్రారంభించిన 'కల్వరి ప్రేమధార' అనే ఈ ద్విమాస పత్రిక నేటివరకు కొనసాగుచున్నది. అయితే ప్రస్తుతం ఎంతో ఆర్థిక లోటులో ఉంది! అందువలననే నేడు అనేక క్రైస్తవ పత్రికలు నిలిపివేయబడినవి. మన పత్రిక కొనసాగాలంటే ఈ నూతన సంవత్సరములో మీ వార్షిక చందాలను, విరాళములను పంపించి, పత్రికాభివృద్ధికి సహకరించండి!

# చెన్నైలో కల్వరి చర్చిలో జరిగే ఆదివారము ఆరాధనలకు ఆహ్వానము!

★ చెన్నైలోని 'కల్వరి చర్చి'లో ప్రతి ఆదివారం జరిగే ఆరాధనలలో పాల్గొని, దైవాశీస్సులు పొందండి!

★ 'కల్వరి దర్శనం' టి.వి. పరిచర్యల ద్వారా మీరు పొందుచున్న మేలులను తెలియజేసి, ప్రభువును మహిమపరచండి!

★ మీ ప్రార్థన అవసరతల కొరకు నేరుగా ప్రార్థించుటకు ప్రతి ఆదివారము దైవజనులు Dr. N. జయపాల్ గారు అందుబాటులో ఉంటారు!




ఆరాధన సమయములు : ప్రతి ఆదివారము
ఉదయం 7:00 గం॥ల నుండి 10:00 గం॥ల వరకు **మరియు**
ఉదయం 10:00 గం॥ల నుండి మధ్యాహ్నం 2:00 గం॥ల వరకు

# 16 GB మెమొరీ కార్డ్స్ & పెన్ డ్రైవ్స్

★ సందేశాలు సంగీతాలు - యెరూషలేము (60 గంటలు)
★ కల్వరి సునాద గీతములు - కుటుంబమును కట్టు సత్యములు (60 గంటలు)
★ మీకు తెలుసా? - మన్నా మనకు (60 గంటలు)

**ఒక్కొక్కదాని వెల రూ. 1,000/-. అయితే తగ్గింపు ధరగా రూ. 700/- లకే పొందగలరు!**

**మా చిరునామా : Dr. N. JAYAPAUL, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.** మరిన్ని వివరములకు – (O) 89 39 39 39 39




CALVARY PREMADHARA (Bi-Monthly) November - December 2019
Registered with Registrar of News Papers India, Under NO: 69868/98